హైదరాబాద్ వార్త



# వరద నివారణపై 'బల్దియా' ఫోకస్

-నాలా అనుకుని ఉన్నభవనాలను కూల్చివేతకు చర్యలు
-నివాసేతర భవనాలు, కమర్షియల్ గోదాములపై దృష్టి
-గ్రేటర్‌లో 12వేలకు పైగా అక్రమణలు ఉన్నట్లు గుర్తింపు





**హైదరాబాద్, అక్టోబరు 4,ప్రభాతవార్త:** మహానగరంలో ఇటీవల తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదు కావటంతో పలు ప్రాంతాలు ముంపునకు గురి కావటంతో జీహెచ్ఎంసీ మరో సారి వరద నివారణపై దృష్టి సారించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కోర్ సిటీలో నిజాం కాలంలో నిర్మించిన వరద నీటి కాలువలు, నాలాలు గంట వ్యవధిలో రెండు సెంటీమీటర్ల వర్షం కురిస్తే తట్టుకునే సామర్థం ఉండగా, ఇటీవల నగరంలో గంటకు 20 సెంటీమీటర్ల వర్షం కురిసి, నగరం అతలాకుతలం కావటంతో పాటు కొద్ది రోజుల క్రితం జంట జలాశయాలు ఉస్మాన్ సాగం, హిమాయత్ సాగర్‌ల ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్లలోకి భారీగా వరద నీరు రావటంతో రెండు జలాశయాల నుంచి రికార్డు స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేయటంతో మూసీ నది ఉధృతంగా ప్రవహించి పరివాహక ప్రాంతాల్లోని ఇండ్లు, ఎంజీబీఎస్ జలమయమైన ఘటనతో వరదల నివారణలో భాగంగా హైదరాబాద్ నగరంలోని నాలాల పక్కనున్న నివాసేతర భవనాలను నేలమట్టం చేసి, నాలాలను విస్తరించాలని జీహెచ్ఎంసీ భావిస్తుంది. అందులో ముఖ్యంగా నాలాల పక్కనే ఎవరూ నివసించకుండా ఉన్న కట్టడాలు, కమర్షియల్‌గా వినియోగిస్తున్న షెడ్డులు, గోదాములు వంటివి కూల్చేసి నాలాలను విస్తరించుకుంటే కొంత వరకు వరదల తీవ్రత తగ్గుతుందన్న ప్రతిపాదనలు సర్కారుకు పంపిట్లు సమాచారం. దీనిపై సర్కారు క్లియరెన్స్ ఇవ్వగానే క్షేత్ర స్థాయిలో నివాసేతర భవనాల కూల్చివేతల పనులను ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. వరదల నివారణ, మూసీ నది పునరుజ్జీవం అంశాలపై ఇటీవలే బతుకమ్మ కుంట ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి కూడా క్లారిటీ ఇచ్చిన సంగతి తెల్సిందే. జీహెచ్ఎంసీ పరిధిలో 370 కి.మీల పొడువున మేజర్ నాలాలు, మరో 1250 కి.మీల పొడువున వరద నీటి కాలువలున్నాయి. ఆక్రమణల కారణంగా ఈ నాలాలు, వరద నీటి కాలువలు కుదించుకుపోవటంతో చిన్న పాటి వర్షానికే నాలాల పక్కనున్న కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్నాయి. పట్టణీకరణ నేపథ్యంలో నగరంలో పరిస్థితులు మరింత దారుణంగా మారటంతో ఇలాంటి పరిస్థితులకు చెక్ చెప్పేందుకు హెచ్ సిటీ కార్యక్రమంలో భాగంగానే స్ట్రాటెజిక్ నాలా డెవలప్ మెట్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్డీపీ) ద్వారా నాలాల విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దీనికి సమాంతరంగా ఆక్రమణల తొలగింపులు చేపట్టాలన్నది సర్కారు నిర్ణయంగా తెలుస్తుంది.

**దాదాపు 12వేల ఆక్రమణలు..**

జీహెచ్ఎంసీ పరిధిలోని చిన్న, మధ్య, భారీ తరహా నాలాలు, వరద నీటి కాలువలపై మొత్తం 12 వేల ఆక్రమణలున్నట్లు ఇదివరకే జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు 35 శాతం వరకు నివాసేతర నిర్మాణాలున్నట్లు, నాలాలకు అడ్డంగా రెండు, మూడంతస్తుల భవనాలు నిర్మించినట్లు గుర్తించారు. కొన్నిచోట్ల 30 అడుగుల వెడల్పు ఉన్న నాలాలు ఆక్రమణల కారణంగా పది అడుగులకు కుదించుకుపోయాయి. ఇంకొన్ని చోట్ల నాలాలు రెండు, మూడు అడుగుల కంటే ఎక్కువ వెడల్పు లేకపోవడంతో వరద నీరు మురుగు నీటితో కలిసి లోతట్టు ప్రాంతాల్లోకి, నాలా పక్కనేనున్న ఇండ్లలోకి ప్రవహిస్తుంది. నాలాల సమగ్రాభివృద్ధికి రూ. 10 వేల కోట్లు అవసరమని గతంలో ప్రణాళికలు రూపొందించారు. అప్పటి సీఎం కేసీఆర్ కూడా 2020 వరదల సమయంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాతే ఎస్ఎన్డీపీని తెరపైకి తెచ్చి, మొదటి దశను అమలు చేశారు.

**కేవలం నివాసేతర భవనాలే ఎందుకంటే..**

మూసీ చుట్టూగానీ, ఇతర ప్రాంతాల్లో గానీ కేవలం నివాసేతర భవనాలను మాత్రమే తొలగించాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. నివాసేతర భవనాలు ముందుగా తొలగిస్తే పునరావాసం కల్పించాల్సిన అవకాశం లేకపోవటం, తొలగింపుకు ఎలాంటి అడ్డంకులు ఎదురయ్యే అవకాశం లేనందున మొదటి దశగా సర్కారు వీటిపై ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. మరోవైపు నివాసేతర భవనాలను ముందుగా తొలిగిస్తే, తర్వాత అక్రమంగా నిర్మించి నాలాలపై ఉన్న ఇతర భవనాలను సమయానుకూలంగా తొలగించడం సులభవుతుందని విస్తున్నట్లు సమాచారం. చెరువుల్లో ఆక్రమణల ఫిర్యాదుల పరిష్కారంలో ఆశించిన ఫలితాలను సాధిస్తున్న హైడ్రాకే నివాసేతర భవనాల తొలగింపు బాధ్యతలను అప్పగించే అవకాశమున్నట్లు తెలిసింది.

# ఇండ్ల మధ్య ఫైర్‌స్టేషన్

-అగ్ని ప్రమాదం జరిగితే ఇరుకు రోడ్ల మధ్య ఫైర్ ఫైటర్స్ పరుగుతీసేదెలా?
-కంటోన్‌మెంట్ ఫైర్‌స్టేషన్ అధికారుల ఆంక్షలతో స్థానికుల జీవితాలు అగమ్యగోచరం






**హైదరాబాద్, అక్టోబరు 4 ప్రభాతవార్త:** ప్రజలకు సమస్యలు వస్తే పాలకులకు చెప్పుకుంటే పరిష్కారిస్తారు. ప్రజలు తప్పు చేస్తే పాలకులే వాటిని సరిచేస్తారు. మరి సమస్యలను పరిష్కరించే పాలకులే తప్పు చేసి ప్రజలకు సమస్యలను సృష్టిస్తే ఆ ప్రజలు ఎవరికి చెప్పాలి. ఆ సమస్యలు పరిష్కారమయ్యేది ఎలా? ప్రజా ప్రయోజనాల కోసం ఓ కాలనీకి చెందిన స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తే ఆ స్థలాన్ని ఉపయోగించుకుని ఆకాలనీ ప్రజలకే సమస్యలను తెచ్చిపెట్టింది ప్రభుత్వం."గత రెండేళ్లుగా ఈ పరిస్థితిని సికింద్రాబాద్ తిరుమల గిరిలోని టీచర్స్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఇండ్ల మధ్యలో కంటోన్‌మెంట్ ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఫైర్ స్టేషన్ అధికారులు విధిస్తున్న ఆంక్షలతో కాలనీవాసులకు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విస్తృత ప్రజా ప్రయోజనం దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయం దురదృష్టవశాత్తు కాలనీవాసులకు శాపంగా మారింది. ఈ ప్రాంతంలో 2024లో ఏర్పాటు చేసిన కంటోన్‌మెంట్ ఫైర్ స్టేషన్ అత్యవసర కార్యకలాపాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. నివాస భవనాల మధ్య నడిచే 20 అడుగుల వెడల్పు గల రోడ్డు. ఈ ఇరుకైన మార్గం ఎప్పుడు ఏ సమయంలోనైనా భారీ అత్యవసర వాహనాలను పార్క్ చేస్తున్నారు. ఫలితంగా ఈ ప్రాంతం సురక్షిత రహిత పరిస్థితిని సృష్టిస్తున్నది. ఒకప్పుడు నిశ్శబ్దంగా, నివాసయోగ్యంగా ఉన్న ప్రాంతం ప్రస్తుతం నిరంతర ఒత్తిడి, సమస్యాత్మక ప్రాంతంగా మారింది. టీచర్స్ కాలనీ పరిసర ప్రాంతాల బస్తీల నివాసితులు తెలిపిన వివరాల ప్రకారం విద్య, వైద్య, తదితర సామాజిక ప్రజా అవసరాల కోసం టీచర్స్ కాలనీకి చెందిన సొంత స్థలాన్ని ప్రభుత్వానికి ఇచ్చింది. కాలనీ ఇచ్చిన స్థలాన్ని కాలనీ ప్రజలు ఆశించిన అవసరాల కోసం కాకుండా అక్కడ కంటోన్ ఫైర్ స్టేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాలనీకి అందుబాటులో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడం మంచిదే కానీ, కాలనీ ప్రధాన రహదారిపై కాకుండా ఇండ్ల మధ్య ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసి రాత్రి పగలు అని తేడా లేకుండా స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఒక బహుళ అంతస్థుల భవన నిర్మాణానికి అనుమతి కోసం వాణిజ్య భవనానికి చుట్టుపక్కల కనీసం 40 ఫీట్ల రోడ్డు, నివాస భవనానికి కనీసం 30 ఫీట్ల రోడ్డు ఉంటేనే అగ్ని మాపక శాఖ ఆభవన నిర్మాణానికి అనుమతి ఇస్తుంది. ఇంతటి కఠిన నిబంధనలు ఉండగా, ఆ అగ్నిమాపక శాఖ ఫైర్ స్టేషన్ ఏర్పాటు, అందులోని ఫైర్ ఫైటర్ వాహనాల రాకపోకలు సాగించడానికి ఇంకా పెద్ద రోడ్లు అవసరమనేది అందరికీ తెలిసిందే. అయితే ఒక వైపు కేవలం 20 ఫీట్ల రోడ్డు మరో రెండు వైపులా 15 ఫీట్ల రోడ్లు మాత్రమే ఉన్న కాలనీ ఇండ్ల మధ్యలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసిన అగ్నిమాపక శాఖ అధికారుల పనితీరుపై కాలనీ నివాసి పి.ఆదిశేషు ఆవేదన వ్యక్తం చేశారు.ఫైర్‌స్టేషన్ ఇరువైపులా ఉన్న రోడ్లు చిన్నవి కావడంతో కాలనీ వాసులు వారి ఇళ్ళ ముందు కార్లు పార్క్ చేసుకుంటే చలాన్లు వేస్తున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు నిలిపినా ఫైర్ స్టేషన్ సిబ్బంది అభ్యంతరం చెబుతున్నారు. కనీసం పిల్లలు కూడా ఆడుకోవద్దని బెదిరిస్తున్నారు. మరోవైపు కంటోన్‌మెంట్ చుట్టు పక్కల ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా ఫైర్ స్టేషన్ లో నిలిపి ఉంచిన వాహనాలు సులభంగా, తొందరగా బయటకు వెళ్లే పరిస్థితి కూడా లేదు. ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసే స్థలం, నివాసాల గురించి కంటోన్మెంట్ బోర్డు సిఈఓ సహా ఉన్నత అధికారులకు తెలిసినప్పటికీ అక్కడ ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాలనీలో ఫైర్ స్టేషన్ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు స్థానిక కంటోన్ మెంట్ సిఈఓకు, జిల్లా కలెక్టర్ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇలా సంబంధిత అన్ని శాఖల అధికారులకు తెలియజేశారు.ఈ ప్రాంతం కంటోన్ పరిధిలో ఉండడంతో కేంద్ర ప్రభుత్వ గ్రివెన్స్ పోర్టల్ లో ఫిర్యాదు చేయగా, నివాసాల మధ్య ఫైర్ స్టేషన్ ఏర్పాటు అనైతికమని, కాలనీ నుంచి ఫైర్ స్టేషన్ ను తరలించాలని కేంద్ర ప్రభుత్వం సూచించినా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. ఫలితంగా ఫైర్ స్టేషన్ వల్ల తమకు ఎదురవుతున్న ఇబ్బందులు, పరిస్థితిని ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక కాలనీ ప్రజలు నిత్యం నరకయాతనను, మనోవేదనను అనుభవిస్తున్నారు.





దేవి నవరాత్రులు ముగిసిన సందర్బంగా ట్యాంక్‌బండ్ ,నెక్లెస్ రోడ్డు ప్రాంతాలలో శనివారం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

# బస్తీ దవఖానలకు సుస్తీ పట్టించిన కాంగ్రెస్

-పేదలకు వైద్యం ఇవ్వాలన్నదే కెసిఆర్ లక్ష్యం
-మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి
-కొత్తపేట టీమ్స్ ఆసుపత్రిని సందర్శించిన టిఆర్ఎస్ నేతలు



ఆసుపత్రిని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** ప్రజలకు మంచి వైద్యం అందాలన్నదే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుదీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్ తో కలసి హరీష్ రావు శనివారం కొత్తపేటలోని గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న తెలంగాణ ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ (టిమ్స్ ) పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పదివేల పడుకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉండాలని 100 సంవత్సరాల ముందు చూపుతో ప్రణాళికలు రచించి ఆచరణలో పెడుతూ నగరం నలుమూలల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆస్పత్రుల పనులను పూర్తి చేయకుండా వాటిని నిలిపివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 33 జిల్లాలలో 33 ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఘనత కేసిఆర్కే దక్కుతుందన్నారు. పేదలకు విద్యా, వైద్యం అందాలని కెసిఆర్ ఎంతో తపించి పోయారన్నారు. 2023లో రూ.176 కోట్లతో మహేశ్వరం నియోజకవర్గం లో మెడికల్ కళాశాల మంజూరి చేస్తే అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి తో కలిసి పనులకు శంకుస్థాపన కూడా చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆ మెడికల్ కళాశాలను రద్దు చేసింది అన్నారు. కాంగ్రెస్ నాయకుల తప్పుడు చర్యల వల్ల రాష్ట్ర ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.రేవంత్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల అయినా కేసీఆర్ ప్రారంభించిన టీమ్స్ ఆసుపత్రుల పనులు పూర్తి చేయడం చేయడంలో విఫలమయ్యారన్నారు.మీ రాజకీయాల కోసం ఆసుపత్రుల నిర్మాణం ఆపొద్దు, వరంగల్ హెల్త్ సిటీ, హైదరాబాద్ టిమ్స్ ఆసుపత్రులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మీ వ్యక్తిగత రాజకీయాల కోసం చెలగాటం ఆడ వద్దని హెచ్చరించారు. లేదంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని అన్నారు. రేవంతు పుణ్యమా అని బస్తీ దవాఖానలో పని చేసే డాక్టర్లు, స్టాఫ్ నర్సులు,ఉద్యోగులకు ఆరు నెలల నుంచి జీతాలు లేవని, కేసీఆర్ ప్రారంభించిన బస్తీ దవాఖానలు మూతపడాలన్నదే రేవంతు లక్ష్యమా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి మహేశ్వరం నియోజకవర్గం మురుకుంట్ల అరవింద్, మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్ రెడ్డి, కొత్తపేట బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థి ఎంపికకు బిజెపి త్రిసభ్య కమిటీ

- జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి కోసం బిజెపి వేట

**జూబ్లీహిల్స్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రానున్న ఉపెన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థి ఎంపికకు త్రిసభ్య కమిటీని వేసింది. ఈ మేరకు అధిష్టానం మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ ఎంపీ రాములు, న్యాయవాది కోమల ఆంజనేయులుతో ఈ కమిటీని నియమించింది. తద్వారా అభిప్రాయ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఇప్పటికే పార్టీ రాష్ట్ర అధిష్టానం వారికి ఆదేశించింది. ఈ నెల మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలుస్తుంది. గతంలో బీజేపీ నుంచి పోటీచేసిన జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, జూటూరు కీర్తిరెడ్డిలతోపాటు ఆకుల విజయ, కిలారు మనోహర్, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యాపారి లక్ష్మీ నారాయణ తదితర పేర్లు ప్రధానంగా వినిస్తున్నాయి. ఇప్పటికే పార్టీకి చెందిన కీలక నేతలు క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా అభ్యర్థి ఎంపిక విషయంలో బీజేపీలోని కొందరు అధినాయకుల మధ్య ఇప్పటికే పోటీ నెలకొంది. తాము సూచించే అభ్యర్థికి కేటాయించాలంటూ వారు ఇప్పటికే అధిష్టానం వద్ద పట్టుబడుతున్నారు. అయితే త్రిసభ్య సూచించే పేర్లతోపాటు బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు తీసుకొనే నిర్ణయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి తద్వారా వీలైనంత త్వరగా అభ్యర్థిని ప్రకటించే దిశగా పార్టీ అడుగులు వేస్తుంది. వారం రోజుల్లో అభ్యర్థి పేరు ఖరారయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ఉన్న నేపథ్యంలో అదేది ఇక్కడ వర్తించదనే అభిప్రాయాన్ని పార్టీ నాయకులు కొందరు ఇప్పటికే చెబుతున్నారు. అభ్యర్థి తేలితే క్షేత్రస్థాయిలో పనిచేయవచ్చని నియోజకవర్గ బీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.

# ఏడేళ్ల బాలిక హత్య కేసులో నిందితుల అరెస్టు

## ..మేనమామ, మేనత్తే నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డిసిపి శ్రీకాంత్

**సైదాబాద్, అక్టోబరు 4 ప్రభాతవార్త:** మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఏడేళ్ల బాలిక హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను మేనమామే తన భార్యతో కలిసి హత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. దీనికి సంబంధించిన వివరాలను సౌత్ ఈస్ట్ అడిషనల్ డిసిపి శ్రీకాంత్ శనివారం ఎసిపి వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులుతో కలిసి వెల్లడించారు. సంతోష్‌నగర్‌లో నివసించే షబానా సుల్తానా తన కూతురు హుమ్మైహని సుమైయా(7)తో కలిసి మంగళవారం మధ్యాహ్నం చౌనిలో ఉన్న తన తల్లిగారింటికి వచ్చింది. బుధవారం తెల్లవారుఝామున పని నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన షబనాకు తన కూతురు కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికి ఫలితం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఇంటి పరిసరాల్లోని సిసి కెమరాలను పరిశీలించగా బాలిక బయటకు వెళ్లినట్లుగా, బయటివారు ఎవరు లోనికి వచ్చినట్లుగా కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులపైనే అనుమానం వచ్చి ఆ కోణంలో విచారణ ప్రారంభించారు. ఇంటి మొదటి అంతస్తులోని వాటర్ ట్యాంకులో చూడగా బాలిక శవం కనిపించింది. బాలిక చేతులు వెనక్కు విరిచి కట్టేసి ఉన్నాయి. నోటికి ప్లాస్టర్ అంటించి ఉంది. దీంతో పోలీసులు మరింత లోతుగా విచా రించగా మేనమామ, మేనత్తలే బాలికను హత్య చేసినట్లుగా నిర్ధారణ జరిగింది. బాలిక కుటుంబంతో మేనమామ మీర్ సమి అలీ(36)కు ఆస్తి తగాదాలు ఉన్నాయి. మీర్ సమి అలీ ఇటీవల తన పేరు మీదకు మార్పించుకున్న ఒక ఇంటికి సంబంధించి కొంత నగదును షబనా సుల్తానాకు ఇవ్వాల్సి ఉంది. దీంతో తరచుగా షబనా సుల్తానా తన పిల్లలతో కలిసి మీర్ సమి అలీ ఇంటికి వచ్చి డబ్బు గురించి గొడవ పడేది. మూడు సం వత్సరాల వయస్సు న్న మీర్ సమి అలీ కూతురు గత ఏడాది నవంబరులో చని పోయింది. షబనా సుల్తానా చేతబడి చేయించడం వల్లే తన కూతురు చనిపోయిందన్న అనుమానం మీర్ సమి అలీకి ఉంది. ఈ క్రమంలో షబనా సుల్తానాపై, ఆమె కుటుంబ సభ్యులపై మీ ర్ సమి అలీ, అతని భార్య యాస్మిన్ బేగంలు కక్ష పెంచుకున్నారు. షబ నా సుల్తానా కూతురు హుమ్మైహని సుమైయాను హత్య చేయాలని నిర్ణయించు కున్నారు. మంగళవారం షబనా సుల్తానా తన కూతు రుతో కలిసి తమ ఇంటికి రావడంతో ఇదే అదనుగా భావించి, షబనా సుల్తా నా ఇంట్లో లేని సమయం కోసం వేచి చూసి బుధవారం ఉదయం 7.20 నుండి 7.40 మధ్యలో బాలికను హత్య చేశారు ఆడుకుందామని చెప్పి బెడ్ షీట్‌తో బాలి క చేతులు వెనక్కి విరిచి కట్టి, నోటికి టేపు అంటించి మొదటి అంతస్తుకు తీసుకువెళ్లారు. అక్కడ ఉన్న వాటర్ ట్యాంకులో బాలికను పడేసారు.దీంతో ఊపిరాడక బాలిక మృతి చెందింది.

# జంట జలాశయాల గేట్లు మళ్లీ ఎత్తిన జలమండలి అధికారులు

- గండిపేట వద్ద ఆరు గేట్లు, హిమాయత్ సాగర్ వద్ద 2.గేట్లు ఎత్తివేత
- మూసీలోకి 5.వేల క్యూసెక్కుల నీరు విడుదల
- ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారగణం

**నార్సింగి, అక్టోబర్ 4 ప్రభాతవార్త :** రాజధాని హైదరాబాద్ మహానగర శివారుల్లో ఉన్న జంట జలాశయాల గేట్లను జల మండలి అధికారులు ముందు జాగ్రత్తలో భాగంగా శనివారం మళ్లీ ఎత్తారు. గండిపేట జలాశయం వద్ద 6.గేట్లను 3.ఫీట్ల మేర ఎత్తి మూసీలోకి 2028.క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే హిమాయత్ సాగర్ జలాశయం వద్ద 2.గేట్లను 3.ఫీట్ల మేర ఎత్తి ఈసీలోకి 2.వేల క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. దీంతో ప్రస్తుతం మూసీలో 5.వేల క్యూసెక్కుల వరద నీరు పారుతుంది. గత వారంలో పెద్ద ఎత్తున వరదలు రావడంతో ఒక్కసారిగా వరద నీరు పెరిగిపోయి జలాశయాలు నిండుకుండాల్లా మారాయి. గంట గంటకు వరద నీరు పెరుగడంతో అధికారులు గండిపేట వద్ద ఉన్న మొత్తం 15.గేట్లు, హిమాయత్ సాగర్ వద్ద ఉన్న 11.గేట్లను ఎత్తి ఏకంగా 34.వేల క్యూసెక్కుల నీటిని ఒకేసారి మూసీ నదిలోకి వదిలిపెట్టారు. ఈ వరద బీభత్సంతో మూసీ పొంగి ఉగ్రరూపం దాల్చింది. పరివాహక ప్రాంతలో ఉన్న దేవాలయాలు, ఇళ్లు, స్మశానాలు, దోబీఘాట్లు, బ్రిడ్జిలన్నింటిని ముంచెత్తింది. ఇమ్లీబాన్ బస్టాండ్ మొత్తం వరద నీటితో నిండిపోయి బస్సుల రాకపోకలు సైతం నిలిచిపోయాయి. రెండు రోజులు పాత నగరంలోని ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని అల్లాడిపోయారు. వరుణు కరుణించి వర్షం కురువకపోవడంతో బతుకు జీవుడా అంటూ వరద బాధిత ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఈ సారి జల మండలి అధికారులు అప్రమత్తమై ముందస్తుగానే గేట్లు ఎత్తి దిగువకు నీరు వదిలిపెడుతున్నారు. వరద ఉధృతి పెరిగినా నగర ప్రజలు ఇబ్బందులకు గురి కావద్దన్న ఉద్దేశంతోనే ఈ చర్యకు ఉపక్రమించినట్లు తెలుస్తుంది. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు వరద ఉధృతిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

# జంటనగరాల్లో ఆర్టీసి బాదుడు

-ఆర్డినరీ, మెట్రోఎక్స్‌ప్రెస్, ఈఆర్డినరీల్లో అదనపు వసూళ్లు

-మొదటి స్టేజీకి రూ.5 నాలుగో స్టేజ్ నుంచి రూ.10 పెంపు

-అలాగే మెట్రోడీలక్స్, ఈమెట్రో, ఏసి సర్వీసుల్లో

-మొదటిస్టేజీ రూ.5 రెండోస్టేజీ నుంచి రూ.10 అదనం

-రేపటి నుంచి అమల్లోకి రానున్న కొత్త ఛార్జీలు



**హైదరాబాద్, అక్టోబర్ 4, ప్రభాతవార్త:**

తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక భారం మోయలేని తరుణంలో జంటనగరాల్లో ఆర్టీసి బస్సు చార్జీలను పెంచాలని నిర్ణయించకుకుంది. సిటీ బస్సుల్లో . మొదటి మూడు స్టేజీల వరకు రూ.5 పెంపు, నాలుగో స్టేజ్ నుంచి రూ.10 పెంపు వర్తించనుంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈఆర్డినరీ, ఈ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ పెంచిన ఛార్జీలు వసూలు చేస్తారు. అలాగే.. మెట్రో డీలక్స్, ఈమెట్రో, ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీ వసూలు చేస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకునేందుకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం చర్యలు ప్రారంభించింది. రాబోయే రెండేళ్లలో దశల వారీగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనుంది. ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు సర్కార్ అనుమతి ఇచ్చింది.ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 25 డిపోలు ఉన్నాయి. అందులో 6 డిపోల పరిధిలో 265 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. ఈ ఏడాదిలో అందుబాటులోకి రానున్న మరో 275 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్థిక భారాన్ని మోయలేం.. అందుకే చార్జీలు పెంచాల్సి వస్తోందని టీజీఎస్ఆర్టీసీ అంటోంది.

## ఆరోగ్యశ్రీ ప్రతి ఒక్కరికి శ్రీరామరక్ష



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 4, ప్రభాతవార్త**

ప్రజాస్వామ్యంలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందని బలమైన సమాజ నిర్మాణానికి దోహద పడుతుందన్న ఉద్దేశ్యంతో రెండు దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ రాష్ట్రంలో కోట్లాది మంది పేద మధ్యతరగతి ప్రజల ఆరోగ్యానికి శ్రీరామ రక్షగా నిలుస్తుందనీ టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలానగర్ డివిజన్ లోని సాయి నగర్ ప్రాంతానికి చెందిన పాలడుగు వెంకటకృష్ణా గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలుసుకుని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్ దృష్టికి తీసుకురాగా వారు వెంటనే వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని తక్షణమే స్పందించి సదరు వ్యక్తికి ముఖ్యమంత్రి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 8,80,000.00 విలువ గల చెక్కును బండి రమేష్ వారి స్వగృహానికి స్థానిక నాయకులు కార్యకర్తలతో చేరుకుని చెక్కును అందించారు.కార్యక్రమంలో కూకట్‌పల్లి టిడిపి నాయకు డు చిలుకూరి చందు, వినాయక నగర్ నగర్ అధ్యక్షుడు సిద్దు, లక్ష్మణ్, పుష్ప రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, యుగేందర్ రెడ్డి,పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, శ్రీనివాస్ గౌడ్, మధు, రామ్మోహన్‌రావు, భరత్, నరేందర్, మహేందర్, రేణుక, సాయి భారతి పాల్గొన్నారు.

## అన్నపూర్ణేశ్వరి యోగ మాత ఆలయాన్ని సందర్శించిన రాజేశ్వరరావు



సద్గురు జగన్ గురూజీ ఆశీస్సులు అందుకుంటున్న వడ్డేపల్లి

**కూకట్‌పల్లి, అక్టోబర్ 4, ప్రభాతవార్త**

దసరా పండుగ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గాజులరామరంలోని దేవి శ్రీ అన్నపూర్ణేశ్వరి యోగ మాత ఆలయాన్ని సందర్శించి మాత అన్నపూర్ణేశ్వరి దేవి దర్శనమును గావించారు. అనంతరం సద్గురు జగన్ గురూజీ వేద ఆశీర్వచనములతో ఆశీర్వదించగా, గాజులరామారంలోని శ్రీ యోగమాత అన్నపూర్ణేశ్వరి దేవి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖ సంతోషాలు, ఐశ్వర్యం, శాంతి నెలకొనాలని అమ్మవారి అనుగ్రహం ఉండాలని భక్తుల జీవితంలో అమ్మవారి దైవశక్తి, దైవకృప, రక్షణ, ఆనందం, శాంతి, సంపద, కోరికల నెరవేర్పు కలగాలని కోరుకుంటున్నానని రాజేశ్వరరావు తెలిపారు.

## పేదలకు వరం ఉచిత వైద్య శిబిరం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**కొంపల్లి, అక్టోబర్ 4, ప్రభాతవార్త**

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నందు "ఇస్మాయిలీ సివిక్" ఆధ్వర్యంలో ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు వరం... ఉచిత వైద్య శిబిరం అని అన్నారు. అనేక సంవత్సరాలుగా ఈ ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఇస్మాయిల్ సివిక్ సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా నిరుపేదలకు వైద్య సేవలు అందించేందుకు మరిన్ని శిబిరాలను "ఇస్మాయిలీ సివిక్" ఏర్పాటు చేయాలని, వారికి మా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు పదికి పైగా ఆస్పత్రులు పాల్గొని దాదాపు 400 మంది నిరుపేదలకు తమ వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితాశ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, నాయకులు జంధా కుమార్, సంగీతా రెడ్డి, వేణు యాదవ్, ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ అధ్యక్షులు ఇక్బాల్ మందని తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుని కలిసిన నాయకులు



దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

**దుండిగల్, అక్టోబర్ 4, ప్రభాతవార్త**

విజయదశమి పర్వదినం సందర్భంగా ఐటీ శాఖ రాష్ట్ర మంత్రివర్యులు జిల్లా ఇంచార్జ దుదిల్ల శ్రీధర్ బాబుని వారి నివాసంలో మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు వారితో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బొంగునూరి కిషోర్ రెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ ఓబిసి అధ్యక్షులు కుమార్ యాదవ్, దూలపల్లి సహకార బ్యాంక్ డైరెక్టర్ రాజు, మహేందర్ రెడ్డిలు కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముగిసిన శరన్నవరాత్రోత్సవాలు

**చిక్కడపల్లి, అక్టోబరు 4 ప్రభాతవార్త:**

చిక్కడపల్లి బాపూ నగర్‌లోని బాపుసే వక్ సమాజ్, శ్రీ రాజరాజేశ్వరి అమ్మ వారి ఆలయంలో జరుగుతున్న శరన్న వరాత్రోత్స వాలు ముగిసాయి. శివశ్రీ ఆనంద్‌స్వామి, శివశ్రీ ఈశ్వర్‌స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా పదకొండు రోజుల పాటు నిర్విరామంగా విశేషంగా పూజాది కార్యక్ర మాలు నిర్వహించారు. ఆ జగన్మాత ఆశీస్సులతో సకల సుఖాలు ప్రతి ఒక్కరికీ కలగాలని ఆశిస్తున్నానని అన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఉత్సవాలు జరిగిన ప్రతిరోజు లలితాసహస్రనామ పారాయణ కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం : మంత్రి పొన్నం ప్రభాకర్



ఎర్రగడ్డలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 4, ప్రభాతవార్త :**

ప్రజా పాలన ప్రభుత్వంతో అభివృద్ధిలో ముందుకు వెళుతున్నామని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం జూబ్లిహిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్, యూసుఫ్‌గూడ డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్ ఏజీ కాలనీ చౌరస్తా నుంచి నటరాజ్‌నగర్, శంకర్‌లాల్ నగర్‌లో రూ.2కోట్ల,16లక్షల వ్యయంతో, యూసుఫ్‌గూడ డివిజన్ గణపతి కాంప్లెక్స్ సాయి మనోహర్ అపార్ట్‌మెంట్స్ రూ.7కోట్ల 17లక్షల వ్యయంతో సిసిరోడ్లకు, కమ్యూనిటీ హాల్ స్టోరేజి నిర్వాహణ పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.70లక్షల వ్యయంతో హైదరాబాద్ మెట్రో పాలిటన్ నీటి సరఫరా, మురుగు నీటి బోర్డు నుంచి యూసుఫ్‌గూడ డివిజన్‌లోని శ్రీ కృష్ణానగర్ ఏ బ్లాక్‌లో 6వందల ఎమ్ఎమ్ మురుగునీటి ప్రధాన లైన్లపై దెబ్బతిన్న మాన్‌హోల్ పునర్నిర్మాణం, కృష్ణా నగర్ బి, సి బ్లాకుల్లో 2వందల ఎమ్ఎమ్ మురుగు పైప్‌లైన్ భర్తీ చేయడం, మాదురి హాస్పిటల్ లైన్‌లో, శాలి వాహన నగర్ వద్ద దెబ్బతిన్న 2వందల ఎమ్ఎమ్ బిఐప మురుగునీటి పైప్‌లైన్ భర్తీ చేయడం యూసుఫ్‌గూడ బస్తీ ప్రాంతాలలో దెబ్బతిన్న పైప్‌లైన్‌లను పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో 60వేలకు పైగా నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారని 2వందల యూనిట్ల ఉచిత విద్యుత్, 5వందలకి గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. జూబ్లిహిల్స్ నియోజక వర్గం అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అదేవిధంగా పేదలకు డబుల్ బెడ్‌రూంలు అందించామని ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందిస్తున్నామని ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్దే ధ్యేయంగా ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీలు మీర్జా రహమత్ బెగ్ ఖాద్రి, మీర్జారియాజ్ హోల్ హాసన్ ఎఫండీ, కౌసర్ మొహినుద్దీన్, డిప్యూటి మేయర్ మోతె శ్రీలత, చైర్మన్లు ఇనగాల వెంకట్రామిరెడ్డి, డైరీ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ గుత్తా అమిత్, జూబ్లిహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే వి నవీన్‌యాదవ్, అజారుద్దీన్, కార్పోరేటర్ సీఎన్‌రెడ్డి, జోనల్ కమీషనర్ హేమంత్,ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

### యూసుఫ్‌గూడలో......

జూబ్లిహిల్స్ నియోజక వర్గంలోని యూసుఫ్‌గూడ, డివిజన్ మహమ్మదీయ ఫంక్షన్‌హాల్‌లో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మహిళా శక్తి మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్‌లను మంత్రి పొన్నం ప్రభాకర్ అందించారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత 10 సంవత్సరాలుగా ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న కుట్టు మిషన్‌ల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం ఎర్రగడ్డ యూసుఫ్‌గూడ డివిజన్‌లలో లబ్దిదారులకు కుట్టుమిషన్‌లను పంపిణీ చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ఎన్నో మహిళా అభివృద్ధి పథకాలు కొనసాగిస్తున్నామని అన్నారు.

## ఢిల్లీపై అహ్మదాబాద్ ఘనవిజయం

### -ప్రైమ్ వాలీబాల్ లీగ్



ఢిల్లీ -అహ్మదాబాద్ జట్లమధ్యపోటీ దృశ్యం

**హైదరాబాద్, అక్టోబర్ 4,ప్రభాతవార్త:**

ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) లో ఐదు సెట్ల థ్రిల్లర్స్ అభిమానులను అలరిస్తున్నాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన మరో ఉత్కంఠ పోరులో అహ్మదాబాద్ డిఫెండర్స్ 3-2 (1315, 1315, 1513, 158, 1816) సెట్ల తేడాతో ఢిల్లీ తూఫాన్స్‌పై అద్భుత విజయాన్ని నమోదు చేసింది. తొలి రెండు సెట్లు ఓడి ఓటమి అంచుల్లో నిలిచిన అహ్మదాబాద్ గొప్పగా పుంజుకొని తేడాతో ఢిల్లీని ఓడించింది. అద్భుత ప్రదర్శన చేసిన ఆ జట్టు ఆటగాడు అంగముత్తు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఈ మ్యాచ్ రెండు తొలి రెండు సెట్లలో ఢిల్లీ తూఫాన్స్ పూర్తి ఆధిపత్యం చెలాయిస్తే.. ఆ తర్వాత అహ్మదాబాద్ అద్భుతంగా పుంజుకుని మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఆట ఆరంభంలో ఢిల్లీ కెప్టెన్, సెట్టర్ సక్లయిన్ తారిఖ్ తన మిడిల్ ఎటాకర్లను సమర్థవంతంగా ఉపయోగించుకున్నాడు. ఢిల్లీ ఆటగాడు జీసస్ చౌరియో పదునైన ఎటాక్స్‌తో అహ్మదాబాద్ డిఫెన్స్‌కు సవాల్ విసిరాడు. కార్లోస్ బెర్రియోస్ కొట్టిన సూపర్ సర్వ్ ఢిల్లీకి ఆధిక్యాన్ని అందించింది. చౌరియో, అనూ జేమ్స్ కూడా చెలరేగడంతో తొలి రెండు సెట్లను ఢిల్లీ సునాయాసంగా గెలుచుకుంది. అయితే, మూడో సెట్‌లో అహ్మదాబాద్ స్టార్ ఆటగాడు షోన్ టి జాన్ కోర్టులోకి అడుగుపెట్టడంతో మ్యాచ్ గతి మారింది. అతని రాకతో డిఫెండర్స్ ఆటలో కొత్త ఉత్సాహం వచ్చింది.క్లిష్టమైన దశలో షోన్ టి జాన్ పవర్ ఫుల్ స్పైక్‌తో సూపర్ పాయింట్‌ను సాధించి అహ్మదాబాద్‌ను తిరిగి రేసులోకి తెచ్చాడు. ఆతర్వాత అభినవ్‌ను కోర్టులోకి తీసుకురావడం కూడా జట్టుకు కలిసొచ్చింది. అతని రాకతో డిఫెన్స్ బలపడటంతో మ్యాచ్‌పై అహ్మదాబాద్ పట్టు సాధించింది. ఆలస్యంగా ఫామ్ అందుకున్న బత్తూర్ బత్సూరి కీలక పాయింట్లతో జట్టుకు అండగా నిలిచాడు. అఖిన్ తన నిలకడైన బ్లాక్స్‌తో ఢిల్లీకి అడ్డుకట్ట వేయడంతో అహ్మదాబాద్ వరుసగా రెండు సెట్లు నెగ్గి స్కోరు సమం చేసింది. ఇక, చివరి సెట్ ఆద్యంతం నువ్వా నేనా అన్నట్లు సాగింది. అయితే, పట్టు వదలని అహ్మదాబాద్ 1816 తో సెట్‌ను మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

## నవ్యనాటక సమితి "50వ అఖిల భారత సంగీత నృత్య పోటీలు"



నవ్యనాటక సమితి "50వ అఖిల భారత సంగీత నృత్య పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 4 ప్రభాతవార్త:**

స్వర్ణోత్సవ సంవత్సరమ్ ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో "50 వ అఖిల భారత సంగీత నృత్య పోటీలు" నవంబర్ నెలలో వైభవంగా నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ కుమార్, సమన్వయకర్తలు నిష్ఠల సుధామాల, మధుమతి కులకర్ణిలు తెలియజేసారు. శనివారంనాడు చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ (గోడపత్రిక)ను రాష్ట్ర ఖజానా మరియు లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి. వసుంధర, పోటీల నిర్వాహక సంఘం సభ్యులు రజిత్ ఆకుల, డాక్టర్ కామిశెట్టి గోదాలక్ష్మి, డాక్టర్ ఇందిరా హేమలతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జి. వసుంధర మాట్లాడుతూ 1961 వ సంవత్సరం నుంచి మన సంస్కృతిని ప్రతిబింబించే శాస్త్రీయ సంగీత నృత్య రీతుల్లో యువకళాకారులను ప్రోత్సహిస్తూ, జాతీయ సమైక్యతకు కళారంగం ద్వారా తోడ్పడుతున్న నవ్య నాటక సమితి సాంస్కృతికరంగ సేవను ప్రశంసించారు.ఈ పోటీలను ఉత్తర దక్షిణ భారతదేశంలోని శాస్త్రీయ సంగీత, నృత్య రీతులైన ..హిందుస్తానీ సంగీతం గాత్రం, సితార్, తబలా, ..కర్ణాటక సంగీతం గాత్రం, వీణ, వయోలిన్, మృదంగం లలోనూ,..భరతనాట్యం, కూచిపూడి, కథక్ మరియు ఆంధ్రనాట్యం లలో వయస్సు అధారంగా యువకళాకారులను సీనియర్లు, జూనియర్లు, సబ్ జూనియర్లు గా విభజించి పోటీలను నిర్వహిస్తామని సుధామాల తెలియజేసారు.ఈ పోటీలలో పాల్గొనే ఆసక్తి కలవారు దరఖాస్తు ఫారాలను, సిలబస్ మరియు పోటీల నియమ నిబంధనలు, అక్టోబర్ 5 నుంచి నవ్య నాటక సమితి వెబ్‌సైట్ నవ్యనాటకసమితి.ఓర్‌జి ద్వారా నుంచి పొందవచ్చు.

## ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

### : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



రాజారెడ్డిని పరామర్శిస్తున్న రామచందర్ రావు

**అల్వాల్, అక్టోబరు 4 ప్రభాతవార్త:**

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్‌కు చెందిన పార్టీ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. రాజిరెడ్డి నివాసానికి వచ్చిన రాంచందర్ రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా అండగా ఉంటానని ఆయనకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు అజయ్ రెడ్డి, మాచర్ల శ్రీనివాస్, శ్రీనివాస్ వర్మ, మల్లిఖార్జున్ గౌడ్, గోపి, వినయ్, కరుణ శ్రీ, సుజాత, ఉష తదితరులు పాల్గొన్నారు.



పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా రాజేంద్రనగర్‌లో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి హాజరై నివాళులర్పిస్తున్న దృశ్యం

# ఏది తినాలన్నా..కల్తీ కల్తీ

-పాలప్యాకెట్ నుంచి అల్లంపేస్ట్ వరకు అన్నింట్లో నకిలీలే..

-హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లలో నాసిరకం నూనెలు

-మరిగించిన నూనెలను మళ్ళీ మళ్ళీ వాడకం -అనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్న ప్రజలు



**హైదరాబాద్, అక్టోబరు 4,ప్రభాతవార్త:**

నగరంలో కల్తీ ఆహారం కారణంగా ఆస్పత్రులకు వెళ్లేవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. జిహెచ్ఎంసితో పాటు ఏప్రభుత్వ విభాగం దీనిపై శ్రద్ద చూకపోవడంతో నగరంలో కల్తీకి అడ్డుకట్ట పడటం లేదు. అన్నిరంగాల్లో ముందంజలో నిలుస్తున్న హైదరాబబాద్ నగరం కల్తీలో కూడా నెంబర్‌వన్‌గా మారనుందా అనే అనుమానాలు తలెత్తున్నాయి. ముఖ్యంగా ప్రజా ఆరోగ్యంతో ముడిపడి ఉన్న నిత్యావసర వస్తులవును సైతం కృత్రిమంగా తయారు చేసి విక్రసిస్తున్నారు. హైడ్రోజన్ ఫెరాక్సైడ్ వంటి కెమికల్స్‌ను కలిపి తయారు చేస్తున్నారు. అల్లం, కారం, పసుపు, జిలకర్ర, సాజిర, బాదం, లవంగాలు, ఇలాచీలు,గసగసాలు, మిర్యాలు ..ఇలా ఒకటేంటి ఇంటిలోని వంటగదిలో ఉండే ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే వన్నీ నకిలీవి తయారు చేస్తున్నారు. కారంలో కృతిమ రంగు, ఇటుకపొడి, రంపం పొట్టు, సపోట విత్తనాలు, బట్టల సోడాతో చెక్కెర, కుళ్ళిన అరటిపండ్ల గుజ్జు, అలుగడ్డలు వేసి అల్లం పేస్ట్ వంటివి కలుపుతున్నారు. అలాగే వంటల్లో వాడే నూనెల్లో చనిపోయిన పందులు, పశువులు, ఇతర జంతువుల కళేబరాల నుంచి నూనెలను తయారు చేస్తున్నారు. అలాగే చిన్న పిల్లలు తాగే పాలు సైతం కృత్రిమంగా తయారు చేస్తున్నారు. యూరియా, సర్ఫ్ తదితర మిశ్రమాలను కొద్దిశాతం పాలలో కలిసి విక్రయిస్తున్నారు. ఇలా నగర శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకుని కల్తీ సరుకులను యథేచ్ఛగా తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. ముఖ్యంగా పాతబస్తీ, కాటేదాన్, శంషాబాద్, జల్‌పల్లి, పటాన్‌చెర్వు, బాలాపూర్, పహాడీ షరీఫ్, మీర్‌పేట్, రాజేంద్రనగర్, జీడిమెట్ల తదితర ప్రాంతల్లో గోదాములను ఏర్పాటు చేసుకుని ఈదందాలకు పాల్పడుతున్నారు.

### మరిగించిన నూనెతోనూ ముప్పే..

నగరంలో ఏవీధిలో చూసినా హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్ పుడ్,టిఫిన్ సెంటర్లకు కొదవలేదు. తీరిక లేని సమయాల్లో వారాంతాల్లో చాలామంది ఆహార ప్రియులు వీటిని లొట్టలేసుకుని మరీ తింటున్నారు. వంటనూనెలను నాలుగైదు సార్లు వాడటం, శుభ్రత పాటించకపోవడం, నకిలీ నూనెలు వాడటం వంటివి చేస్తున్నారు. దీంతో అక్కడ తిన్న వినియోగదారులు ఆసుపత్రుల పాలవుతున్నారు. నూనెను ఎక్కువసార్లు మరింగించడం వల్ల అందులోని టోటల్ కాంపౌండ్స్ (టిపిసి)ఫ్రీరాడికల్స్‌గా మారుతాయని వైద్యులు తెలుపుతున్నారు. సాధారణంగా వంటనూనెలో పోలార్ కాపౌండ్స్ 25శాతానికి మించేతే దాన్ని మార్చాలని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలు చెబుతున్నాయన్నారు. కానీ దాదాపు అన్ని హోటళ్లలో మోతాదుకు మించి హానికరమైన ఫుడ్‌కలర్స్, టేస్టింగ్ సాల్ట్, సోయా సాస్‌లను వినియోగిస్తున్నారు. దీంతో కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల రక్తనాళాలు గట్టిపడటం, ఆల్జీమర్స్, కాలేయ,గుండె సంబంధిత వ్యాధులు, హైపర్ టెన్షన్, కొవ్వుపెరగడం, స్థూలకాయం, ఉదరకోశ, అన్నవాహిక క్యాన్సర్ల బారిన పడే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

## 6న సేవా కార్యక్రమాలు చేపట్టాలి : ఎమ్మెల్యే తలసాని


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 4 ప్రభాతవార్త:** తన పుట్టిన రోజు వేడుకలు హంగు ఆర్బాటాలు లేకుండా నిరడంబరంగా జరుపుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు.శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన వారికి పేరు పేరున శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 6వ తేదీన తన పుట్టిన రోజు వేడుకలను ఆయా డివిజన్లలో పేదలకు అన్నదానం, ప్రభుత్వ ఆసుపత్రులు, వృద్ధుల అనాధాశ్రమాల్లో పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కె.హేమలత, మాజీ కార్పోరేటర్లు శేషుకుమారి, అత్తిల్లి మల్లికార్జున్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కొలనుబాల్ రెడ్డి, తలసాని స్కైలాబ్ యాదవ్, శ్రీహరి, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

### బోయిన్‌పల్లి మార్కెట్‌లో అవినీతి అక్రమాలకు తావులేదు : ఆనంద్ బాబు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు,కార్యదర్శి వెంకన్న తదితరులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 4 ప్రభాతవార్త:** బోయిన్‌పల్లి మార్కెట్‌లో ఎలాంటి అవినీతి అక్రమాలకు అస్కారం లేకుండా మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ యార్డు చైర్మన్ అర్.అనంద్ బాబు,కార్యదర్శి వెంకన్నలు తెలిపారు. శనివారం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గుమ్మడి కాయల విక్రయాలలో అవకతవకలు జరిగాయని కొందరు ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. రైతులకు, మార్కెట్ సిబ్బందికి ఉన్న సత్ సంబందాలతో కొందరు ఓర్వలేక ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. కూరగాయలను ఎవరి దుకాణాల మందు వారే విక్రయించుకోవాలని సూచించారు. రోడ్లపై,ఫుట్‌పాత్‌పలై కూరగాయలు విక్రయించ కూడదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్, సికింద్రాబాద్ వెజ్‌టేబుల్ కమీషన్ ఏజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సోమ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు అమృత మంజరి-2 పుస్తకావిష్కరణ

**సైఫాబాద్, అక్టోబరు 4 ప్రభాతవార్త:**
మనుజ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ ఆదివారం సాయంత్రం కైరతాబాద్‌లోని విశ్వేశ్వర్య భవన్‌లో 'అమృత మంజరి భాగం-2', హిందీ భాషలో 'అమృత మందిర్' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.వి.రాజశేఖర్, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి శ్రీరామ్‌తివారి తదితరులు పాల్గొంటారని శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వహకులు శ్రీను, నాగరాజు చెప్పారు.

### 7న పాలస్తీనా సంఘీభావ కమిటీ ప్రదర్శన

**సైఫాబాద్, అక్టోబరు 4 ప్రభాతవార్త:** పాలస్తీనాపై ఇజ్రయిల్ దాడికి నిరసన వ్యక్తం చేస్తూ, పాలస్తీనాకు సంఘీభావం వ్యక్తం చేస్తూ ఈ నెల నెల 7వ తేదీన వామ పక్షాల పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నగరంలో సంఘీభావ ప్రదర్శన నిర్వహిస్తున్నామని పాలస్తీనా సంఘీభావ కమిటి తెలిపింది. ఈ మేరకు శనివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన కమిటీ ప్రతినిధుల సమావేశంలో ప్రతినిధులు స్టాలిన్, మహేందర్, హన్మేష్, ఝాన్సీ, తేజ, తుడుం అనిల్‌కుమార్, వి.సంధ్య, ఛాయాదేవి తదితరులు వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. 7న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్కు వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

### ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలిపిన శేషుకుమారి


విజయ దశమి సందర్భంగా ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**సంజీవరెడ్డి నగర్,అక్టోబర్ 4 ప్రభాతవార్త:** విజయ దశమి సందర్భంగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను అమీర్‌పేట మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి మర్యాదపూర్వకంగా విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కూతురు నర్సింహ,మహిళా నాయకురాలు బాస లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం అహర్నిశలు పాటుపడతాం : కార్తిక్‌రెడ్డి



నార్సింగి మున్సిపాలిటీలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బిఆర్ఎస్ నేతలు.

**నార్సింగి, అక్టోబర్ 4 ప్రభాతవార్త :** నిరంతరం నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం పరితపించిన ప్రజానాయకుడు ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు అహర్నిషలు పాటు పడుతామని బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తిక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ బిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గండిపేటలో ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేసేందుకే ఇంద్రారెడ్డి రాజకీయంలోకి వచ్చారని, నమ్ముకున్న వారికి న్యాయం చేసేందుకు ఎంతకైనా తెగించిన నాయకుడి అడుగుజాడల్లో నడిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఈ రోజు చనిపోతే మరుసటి రోజూ మరిచిపోయే నేటి రోజుల్లో రెండున్నర దశాబ్దాలవుతున్నా ఇంద్రారెడ్డిని నేటికీ మరువకుండా ఆయన జయంతి, వర్ధంతి వేడుకలను జరుపుకోవడం ప్రజల గుండెల్లో ఆయన స్థానంను తెలియజేస్తుందన్నారు. ఇంద్రన్న పిలువు మేరకు యుక్తవయసులో రాజకీయంలోకి వచ్చిన వారే నేడు రంగారెడ్డి జిల్లాలోని అన్ని పార్టీల్లో కొనసాగుతున్నారని తెలిపారు. చాలా మంది ప్రజా ప్రతినిధులు అయ్యారని వివరించారు. ఇంద్రన్న చూపిన మార్గంలో నడిచి, ఆయన ఆశయ సాధనకు కష్టపడుతున్నామని కార్తిక్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు రవీందర్‌రెడ్డి,రాము, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, సీనియర్ నేతలు ముక్తార్‌పాషా, సదానంద్, సంతోష్ పాల్గొన్నారు.

## వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో కార్మికులను తొలగిస్తే సహించేది లేదు

**సైఫాబాద్, అక్టోబరు 4 ప్రభాతవార్త:**
తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషేంట్ కేర్, సెక్యూరిటి కార్మికుల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం కుట్రపన్నుతున్నదని, ఇందులో బాగంగానే వేతనాలు చెల్లించే బడ్జెట్‌లో కొత విధించి బడ్జెట్ విడుదల చేయడం జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా ఆరోపించారు.శనివారం కింగ్ కోఠి ఆసుపత్రి ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ కార్మికులకు గత మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని, పండుగలను సైతం నిర్వహించుకోలేక అర్థాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో 200 బెడ్లు, కింగ్‌కోఠి ఏరియా ఆసుపత్రిలో 150 బెడ్లు ఉన్నాయని, మొత్తం 350 బెడ్లుకు కార్మికుఉ విధులు నిర్వహిస్తుండగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 6 నెలల బడ్జెట్ విడుదల చేసిందని, ఇందులో 40 మంది కార్మికుల వేతనాల్లో కొత విధించడం జరిగిందని ఆరోపించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. పరిషత్ పరిధిలో పనిచేస్తున్నటువంటి అన్ని ఆసుపత్రుల్లో 2వేల బెడ్ల సంఖ్యను కుదించి, 900 మంది కార్మికులను తొలగించే ప్రయత్నంలో ఉదందని ఆరోపించారు. కార్మికులను తొలగిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.


కింగ్‌కోఠి ఆసుపత్రి కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న ఎం.నర్సింహ్మా.

## అజారుద్దీన్‌ను కలిసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ మైనార్టీ నాయకులు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 4, ప్రభాతవార్తః**
కాంగ్రెస్ పార్టీ సీనియర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు మహ్మద్ అజారుద్దీన్‌ను శనివారం నియోజకవర్గానికి చెందిన మైనార్టీలు పెద్దసంఖ్యలో కలిశారు. కొద్ది రోజుల క్రితం అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. అయితే ఆయన ఎమ్మెల్సీ అవకాశాలపై నియోజకవర్గంలోని మైనార్టీ నాయకులకు కొంత అనుమానాలున్నాయి. ఈ క్రమంలోనే మైనార్టీ నాయకులు బంజారాహిల్స్‌లోని నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అజారుద్దీన్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాంటి వదంతులు సర్వసాధారణమన్నారు. పార్టీపై తనకు పూర్తి నమ్మకం ఉందని, తాను ఖచ్చితంగా ఎమ్మెల్సీని అవుతానని స్పష్టం చేశారు. తనకు సోనియా, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్రవ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌లపై పూర్తి నమ్మకం ఉందన్నారు. గత నాలుగైదు రోజులుగా తనను మైనార్టీ నాయకులతోపాటు నియోజకవర్గ నాయకులు వచ్చి కలుస్తున్నారని,జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేయాలంటూ కోరుతున్నారన్నారు.తాను అధిష్టానం ఆదేశానుసారం నడుచుకుంటా నని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎవరూ అధైర్యపడ వద్దని, పార్టీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటుందన్నారు.


అజారుద్దీన్‌తో సమావేశమైన మైనార్టీ నాయకులు.

## 7 నుంచి ఎఫ్ఐపీ సిల్వర్ పాడెల్ టోర్నమెంట్

### ఆతిధ్యం ఇస్తున్న హైదరాబాద్

**హైదరాబాద్, అక్టోబరు 4,ప్రభాతవార్త:**
భారతదేశంలో మొట్టమొదటి ఎఫ్ఐపీ సిల్వర్ పాడెల్ టోర్నమెంట్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తుంది. ఈనెల 7 నుంచి 12 వరకు ఈ పోటీలను హైదరాబాద్‌లోని కేపీజీబీపీలో నిర్వహిస్తారు. ఈటోర్నీ ప్రైజ్ 15 లక్షలు. ఇది భారత పాడెల్ చరిత్రలో అత్యధిక మొత్తం. ఈపోటీల్లో పురుషులు, మహిళల విభాగాల్లో అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన స్టార్లు పాల్గొననున్నారు .ఈ సందర్భంగా ఐపీఎఫ్ అధ్యక్షులు స్నేహ అబ్రహాం సెహగల్ మాట్లాడుతూ, "భారతదేశంలో పాడెల్‌కు ఎఫ్ఐపీ సిల్వర్ హైదరాబాద్ ఒక మైలురాయి వంటిది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అగ్రశ్రేణి అంతర్జాతీయ ఆటగాళ్లు, దేశ చరిత్రలోనే అత్యధిక నగదుతో కూడిన బబహుమతితో, ఈ టోర్నమెంట్ ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతోంది. ఇది కేవలం ఒక పోటీ మాత్రమే కాదు. పాడెల్‌కు ప్రపంచ కేంద్రంగా భారతదేశ తొలి ప్రయాణానికి ఇది ఆరంభం" అని పేర్కొన్నారు.రాధా టీఎంటీ చైర్మన్ సునీల్ సరాఫ్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి నీశి సిల్వర్ టోర్నమెంట్‌కు స్పాన్సర్ చేస్తున్నాం. ఇది మా నమ్మకానికి ఒక నిదర్శనం. ఈ టోర్నమెంట్ ద్వారా అంతర్జాతీయ ఆటగాళ్ల నైపుణ్యం మన దేశ పాడెల్ క్రీడ భవిష్యత్తును కలుపుతుంది" అని పేర్కొన్నారు.

## రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌కు టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న రాడిసిన్ బ్లూ ప్లాజా ప్రతినిధులు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 4, ప్రభాతవార్తః**
బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌కు టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు-2025 లభించింది. తెలంగాణ ప్రభుత్వం తరుపున అందించిన అవార్డులలో భాగంగా క్లాసిఫైడ్ హోటల్- 5స్టార్ విభాగంలో ఈ అవార్డును సొంతం చేసుకొంది. హోటల్ సౌత్ ఇండియా ఏరియా జనరల్ మేనేజర్ సందీప్ జోషి, సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ రాజర్షి భట్టాచార్యలు అవార్డును మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా సందీప్ జోషి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ప్రాంతీయ పర్యాటక రంగ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దిల్‌రాజు పాల్గొన్నారు.

### మంత్రి శ్రీధర్ బాబును కలిసిన మైనంపల్లి


ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, ఆనంద్ బాబు

**అడ్డగుట్ట,అక్టోబర్ 4 ప్రభాతవార్త:** దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్, బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు గౌడ్‌లు శనివారం ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## దేశంలో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయి

### : అశ్రిత డైరెక్టర్ నాగరాజ


సమావేశంలో మాట్లాడుతున్న అశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజ

**చార్మినార్,అక్టోబరు 4 ప్రభాతవార్త :**
భారత దేశంలో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయని అశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజ తెలిపారు.మన దేశంలో బాలికల బాల్య వివాహాలు 69 శాతం,అబ్బాయిల బాల్య వివాహాలు 72 శాతం తగ్గాయని టిప్పింగ్ పాయింట్ టు జీరో,ఎవిడెన్స్ టువార్డ్స్ ఏ చైల్డ్ మారేజ్ ఫ్రీ ఇండియా నివేదికను జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ విడుదల చేసిందని నాగరాజ తెలియజేశారు.హైదరాబాద్‌లోని ఆశ్రిత, ఎన్‌జిఓ జెఆర్‌సి భాగ్యస్వామి కమ్యూనిటీ వర్కర్లతో కలిసి బాలికల రక్షణ కోసం పని చేస్తున్నదని ఆయన తెలిపారు.ఈ ఎన్‌జిఓ సంస్థ గత మూడు సంవత్సరాలలో ఎన్నో బాల్య వివాహాలను ఆపిందని ఆయన తెలియజేశారు.హైదరాబాద్ జిల్లాలో అధికారులతో సమాజాలంతో కలిసి బాల్య వివాహాలను నిర్మూలించటానికి ముందుండి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.భారత దేశం 2030 నాటికి బాల్య వివాహాల రహిత దేశంగా మారుతుందని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ జాతీయ కన్వీనర్ రవి కాంత్ తెలియజేశారు.సమావేశంలో పలువురు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా అమ్మవారికి విశేష పూజలు


కనకదుర్గ నృత్యవిభావరి కార్యక్రమంలో ఆధ్యాత్మిక శ్లోకాలు పటించిన దృశ్యం

**చిక్కడపల్లి అక్టోబరు 4 ప్రభాతవార్త:**
కనకదుర్గ నృత్యవిభావరి కార్యక్రమంలో నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ నృత్యగురువు నిర్మలా ప్రభాకర్ ఆధ్వర్యంలో శిష్యబృందం అమ్మవారి శ్లోకాలు, నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా చండీ అవతారం నిర్వహించడంతో పాటుఉ గణపతిం, వర్ణం, రామరసం, లింగాష్టకం, అయిగిరినందిని, కనకధార స్తోత్రం, శ్రీదేవి ఖడ్గమాల తదితర ఆధ్యాత్మిక పద్యాలను, శ్లోకాలను పటించారు. అనంతరం అమ్మవారి వద్ద పూజలు నిర్వహించారు.

## ట్విట్టర్ పోస్టుకు స్పందించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయిస్తానని హామీ
- ఎమ్మెల్యే స్పందన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**నార్సింగి, అక్టోబర్ 4 ప్రభాతవార్త :**
బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని సాయి వాల్మీకి కాలనీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు ధ్వంసం అయ్యింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మా ప్రాంత సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు ట్విట్టర్‌లో స్థానిక ఎమ్మెల్యేకు ట్యాగ్ చేశారు. ఈ ట్వీట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రెండు రోజులలోనే స్పందించి కాలనీ వాసులను తన ఇంటికి పిలిపించుకొని సమస్యపై ఆరా తీశారు. కాలనీ వాసులతో మాట్లాడి మీ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ నిచ్చారు. వారి ముందే కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్రకు ఫోన్‌చేసి సాయి వాల్మీకి నగర్ కాలనీ సమస్యను వెంటనే పరిష్కరించాలని, అవసరమైన ఎస్టిమేట్ వేయించాలని ఆదేశించారు. రూ. వందకోట్ల పనులకు శంఖుస్థాపనలు చేశామని, 90శాతం వరకు ఆ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే పూర్తి అయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే స్పందన పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించడం, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తుండడం వల్లనే రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలు వరుసగా నాలుగుమార్లు ఎమ్మెల్యే ఎన్నుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి నాయకుడిని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎన్నుకొని ఐదోసారి సైతం అసెంబ్లీకి పంపించేందుకు రాజేంద్రనగర్ ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, బాలాజీ, లోకేష్, రాజేష్‌గౌడ్, సూర్యప్రకాశ్, రాఖేష్, అనిల్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


బండ్లగూడ కార్పోరేషన్ సాయి వాల్మీకి నగర్‌లో రోడ్డు పనులను చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

## రక్షణ శాఖ స్థలాలను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించాలి : మంత్రి పొన్నం

**కంటోన్మెంట్,అక్టోబర్ 4 ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సకింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు రక్షణ శాఖ స్థలాలను ప్రజా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర రక్షణ శాఖ మంత్రిరాజ్ నాథ్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. రోజు రోజుకు గ్రేటర్ మహా నగరం అభివృద్ధి చెందుతుంది. కంటోన్మెంట్ బోర్డు ప్రాంత ప్రజలకు కీలకమైన మౌళికసదుపాయాలు, అవసరాలను తీర్చడంలో, పౌర సౌకర్యాలను మెరుగుపర్చడంలో రక్షణ శాఖ భూములు ఎంతగానో ఉపయోగపడుతాయి. కంటోన్మెంట్ బోర్డు నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి యూజర్ ఛార్జీల కింద దాదాపు వెయ్యి కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బకాయిలను సకాలంలో క్లేర్ చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ అభివృద్ధికి,ప్రజా సౌకర్యానికి అధిక ప్రముఖ్యతగా కొనసాగుతున్న మౌళిక సదుపాయాలు, మొబిలిటీ ప్రాజెక్టలు అమలు చేయడానికి భూ బదలాయింపు ఎంతో కీలకమన్నారు. ఈ అంశాలపై రక్షణ శాఖ మంత్రి పరిశీలించి కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలను గ్రేటర్‌లో విలీనం చేయాలని సమర్పించిన లేఖలో గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్య సభ సభ్యుడు అనీల్ కుమార్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు సంతకాలు చేసి సమర్పించారు.


కంటోన్మెంట్ బోర్డు

### జూపార్కులో 71 వ వరల్డ్ వైల్డ్ లైఫ్ వారోత్సవాలు


మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న జూ పార్కుల డైరెక్టర్ డాక్టర్. సునీల్ ఎస్ హీరామత్

**చార్మినార్,అక్టోబరు 4 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో 71వ వరల్డ్ వైల్డ్ లైఫ్ వారోత్సవాలు జరుగుతున్నాయి. వరల్డ్ వైల్డ్ లైఫ్ వారోత్సవాలలో భాగంగా శనివారం జూపార్కులో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. తెలంగాణ జూ పార్కు డైరెక్టర్ డాక్టర్.సునీల్ ఎస్‌హీరామత్ జూ పార్కులో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో జూ పార్కు క్యూరేటర్ జె.వసంత,డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ ఎంఎ హకీమ్,జూపార్కు డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబా,అసిస్టెంట్ క్యూరేటర్లు నాజియా తబాసుం, బి.లక్ష్మణ్,డిప్యూటీ ఆర్ఓ మాధవిలత పాల్గొన్నారు.

### 'మనోవిహారి' కవితాసంపుటి ఆవిష్కరణ


ప్రముఖ అనువాద రచయిత కస్తూరి రాజశేఖర్ రచించిన 'మనోవిహారి' కవితాసంపుటిని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 4 ప్రభాతవార్త:** కిన్నెర ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ అనువాద రచయిత కస్తూరి రాజశేఖర్ రచించిన 'మనోవిహారి' కవితాసంపుటి ఆవిష్కరణ సభ శనివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని హనుమంతరావు కళావేదికలో జరిగింది. ఆంధ్రాబ్యాంక్ పూర్వ జనరల్ మేనేజర్ వారణాశి వెంకట కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా ఎస్‌బిహెచ్ పూర్వ చీఫ్ జనరల్ మేనేజర్ పసుపులేటి దినకరరావు హాజరై ప్రసంగించారు. ఈ గ్రంథాన్ని కేంద్రసాహిత్య అకాడమి బాలసాహిత్య పురస్కారగ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి, ఎస్‌బిహెచ్ పూర్వ డిజిఎం కస్తూరి నాగేశ్వరరావు, నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

### కనులపండువగా అమ్మవారి ఊరేగింపు మహోత్సవం



**చిక్కడపల్లి, అక్టోబరు 4 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వీధిలో నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారి ఊరేగింపు మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా వేదపండితులకు సత్కరించే కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పలుసబాల్‌రాజ్‌గౌడ్, అధ్యక్షుడు కందూరి కృష్ణ, శివకృష్ణ, చంద్రమోహన్‌గౌడ్, రాపర్తి రాజగోపాల్, తమ్మన కృష్ణమూర్తి, మోటె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలు కళ్యాణ ఆనందపీఠాధ్యక్షుడు 'ఆత్మబంధు' ఆచార్య డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ పర్యవేక్షణలో వారి శిష్యబృందం సభ్యులు నాగరాజు శర్మ, సాయినాధశర్మ, గణేషశర్మలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు నర్సింగరావు, లక్ష్మణ్‌రావు,రాయబారపు శ్రీనివాస్,ఉదయ్‌కుమార్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.లోకకళ్యాణార్థం చేపట్టిన శరన్నవరాత్రోత్సవాలు ప్రజలందరికి శుభాలు జరగాలని ఆకాంక్షించారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**సంజీవరెడ్డి నగర్,అక్టోబర్ 4 ప్రభాతవార్త:** ఎస్.ఆర్.నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్.ఆర్.నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇఎస్ఐ ఆసుపత్రి సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైందని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వృద్దుడు చామన ఛాయ కలరు, వయసు 60 నుంచి 70 సంవత్సరాలు ఉండవచ్చని, ఇఎస్ఐ,ఎర్రగడ్డ పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసుకుంటూ ఫుట్‌పాత్‌పై నివసిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మృతిడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే ఎస్.ఆర్.నగర్ పోలీస్‌లను సంప్రదించాలన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నం. టెండర్ ప్రకటన నం. 12/SE (P-WZ)/GHMC/2025-26, తేది : 01.10.2025 (2వ పిలుపు)

పని యొక్క పేరు: GHMC, జుబిలీహిల్స్, సర్కిల్-18లో విరించి ఆసుపత్రి జంక్షన్ నుండి జుబ్లీహిల్స్ చెక్ పోస్ట్ జంక్షన్‌కు 100అ/120అ RDP వరకు రోడ్ వెడల్పు భాగంలో BT రోడ్ నిర్మాణం. అంచనా మొత్తం : రూ. 150.00 కోట్లు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ/చివరి తేదీ మరియు సమయం : ప్రారంభ తేదీ : 06.10.2025 సా.04.00గం. నుండి. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం : 21.10.2025 మ.03.00గం.వరకు. అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నం: సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, (ప్రాజెక్టులు-WZ) GHMC, 7993360288. తదుపరి వివరాలు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in/ వద్ద చూడవచ్చును లేదా సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు-WZ) GHMC కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.

సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్, (ప్రాజెక్ట్స్-WZ), GHMC.

DIPR.NO.8828-PP/CL/ADVT/1/2025-26 తేది: 04.10.2025



**IN THE COURT OF HONOURABLE I Addl. SENIOR CIVIL JUDGE, MALKAJGIRI-MEDCHAL DIST, AT: MALKAJGIRI**
**O.S. NO. 424 OF 2025**

**Between :**
S. VijayaLaxmi& others ...**Petitioners/Petitioners.**
**A N D**
A.Narasimha Rao & others. ...**Respondents /Respondents.**

To,
2. S. VijayaLaxmi (Impersonated Person), W/o. S.Bhoomaiah, Age: about 72 years, Occ: House Wife, R/o.B-23-9, MCH Quarters, Amberpet, Hyderabad-500013.

Whereas the petitioners filed the above suit against you on the file of the Hon'ble I Addl. SENIOR CIVIL JUDGE, MALKAJGIRI- MEDCHAL DIST, AT: MALKAJGIRI for SUIT FOR DECLARATION AND CANCELLATION OF SALE DEEDS DOCUMENT NO.5946 of 2022 dated 19-08-2022, 6652 of 2022 dated 19-09-2022, 6653 of 2022 dated 19-09-2022, AND 6654 of 2022 dated 19-09-2022.CONSEQUENTIAL RELIEF OF CANCELLATION OF SUBSEQUENT SALE DEEDS AND PERPETUAL INJUNCTION between the Petitioners and you and the said suit now stands posted on 31-10-2025 for your appearance.

Hence, you are hereby informed to appear before the Hon'ble I Addl. SENIOR CIVIL JUDGE, MALKAJGIRI- MEDCHAL DIST, AT: MALKAJGIRI on 31-10-2025 at 10:30 a.m. either in person or through counsel, failing which, the matter will be decided ex-parte as per law.

**//By order of the court//**
**N.MURALI MOHAN, M.BAL RAJ ADVOCATES**
H.No. 6-87/3, M.G.Road, Kummari Basti, Patancheru Town, Sangareddy Dist.
**Cell : 9177222913.**



**IN THE COURT OF HONOURABLE I Addl. SENIOR CIVIL JUDGE, MALKAJGIRI-MEDCHAL DIST, AT: MALKAJGIRI**
**I. A. No. 546 OF 2025**
**IN**
**O.S. NO. 424 OF 2025**

**Between :**
S. VijayaLaxmi & others ...**Petitioners/Petitioners.**
**A N D**
A.Narasimha Rao & others. ...**Respondents /Respondents.**

To,
2. S. VijayaLaxmi (Impersonated Person), W/o. S.Bhoomaiah, Age: about 72 years, Occ: House Wife, R/o.B-23-9, MCH Quarters, Amberpet, Hyderabad-500013.

Whereas the petitioners filed the above suit against you on the file of the Hon'ble I Addl. SENIOR CIVIL JUDGE, MALKAJGIRI- MEDCHAL DIST, AT: MALKAJGIRI for SUIT FOR DECLARATION AND CANCELLATION OF SALE DEEDS DOCUMENT NO.5946 of 2022 dated 19-08-2022, 6652 of 2022 dated 19-09-2022, 6653 of 2022 dated 19-09-2022, AND 6654 of 2022 dated 19-09-2022.CONSEQUENTIAL RELIEF OF CANCELLATION OF SUBSEQUENT SALE DEEDS AND PERPETUAL INJUNCTION between the Petitioners and you and the said suit now stands posted on 31-10-2025 for your appearance.

Hence, you are hereby informed to appear before the Hon'ble I Addl. SENIOR CIVIL JUDGE, MALKAJGIRI- MEDCHAL DIST, AT: MALKAJGIRI on 31-10-2025 at 10.30 a.m. either in person or through counsel, failing which, the matter will be decided ex-parte as per law.

**//By order of the court//**
**N.MURALI MOHAN, M.BAL RAJ ADVOCATES**
H.No. 6-87/3, M.G.Road, Kummari Basti, Patancheru Town, Sangareddy Dist.
**Cell : 9177222913.**



**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM IV JUDICIAL MAGISTRATE OF FIRST CLASS MEDCHAL MALKAJGIRI DIST AT: L.B. NAGAR**
**O.S.No. 1108 of 2025**

BETWEEN:
**Kramadhati Praveen Kumar & another ...Plaintiff's**
And
**Mandal Revenue Officer, Medipally Mandal And another ...Defendants**
To,
**All Concerned ...Defendant No.2**

**NOTICE**

Please take notice that the plaintiff i.e., Kramadhati Praveen Kumar & another had filed a suit for declaration of legal heirs of deceased Late. Kramadhati Prabhakar & Late Kramadhati Sukanya who died on 19-02-2024 & 17-07-2018 respectively vide O.S.No. 1108 of 2025 on the file of the Hon'ble principal Junior Civil Judge cum IV Judicial Magistrate Of First Class, Medchal-Malkajgiri Dist At L.B.Nagar, and the same is posted on **14-10-2025 at 10:30 A.M,** for submitting objections if any, and M/S A. Manik Prabhu Goud, B. Meena, M. Surya Vamshi Goud, A. Ranadheeshwar Goud, Advocates O/o: 3-5-872/A/2, R.K. Vipanchi, Estates, Ground Floor, Hyderguda, Hyderabad, TG-500029, Cell: 9391350841 also appear in person or through an Advocate, if you fail to appear before the above said Hon'ble Court on the said day the case will be decided on merits in your absence.

(BY ORDER OF THE COURT)
**M/S A. Manik Prabhu Goud**
**M. Surya Vamshi Goud**
**Advocates**
O/o: 3-5-872/A/2, R.K. Vipanchi Estates, Ground Floor, Hyderguda, Hyderabad, TG - 500029,
**Cell: - 9391350841**



**IN THE COURT OF THE HON'BLE ADDL JUNIOR CIVIL JUDGE, CUM VII ADDL METROPALITAN MEGISTRATE R.R.DISTRICT, AT: HAYATHNAGAR**
**O.S.No. 774 OF 2025**

Between:
1. **Chikiripally Mounika** W/o. Late Chikiripally Kumar, Aged about 49 yrs., Occ: House hold, R/o Plot No.20 G/F, Gayatrihills, Phase II m Badangpet, Balapur Mandal, R.R. District
2. **Chikiripally Saivardhan Goud** S/o. Late Chikiripally Kumar, Aged about 27 years, Occ: Pvt Employee, R/o H.No. 17-1-380/84, Sanjeevaiahnagar, Santhoshnagar, Hyderabad
3 **Chikiripally Bindu** D/o. Late Chikiripally Kumar, Aged about 24 years Occ: student, R/o H.No. 8-8-106/4, Sriramnagar Colony, Karmanghat, Saroornagar Mandal, Hyderabad ....**PLAINTIFFS**

AND
1. **The Tahasildar (MRO)** Abdullapurmet mandal office Abmandalpurmet , R.R District
2. **All Concerned** ...**DEFENDANTS**

**NOTICE**

Please take notice that the above petition is posted to for declare them as legal heirs of Late CHIKIRIPALLY KUMAR and the said case is posted to 10-10-2025 for your appearance and filing counter before the Hon'ble Addl Junior Civil Judge CUM VII ADDL M.M. COURT R.R.District at Hayathnagar, R.R.District, Date **10-10-2025 at 10-30 A.M.** either in person or through an advocate, in case if you fail to appear before the above Hon'ble Court on the said date and time the matter will be heard exparte.

**SCHEDULE OF PROPERTY**

All that the house bearing house No.1-62, demolished and subsequently converted into open plot) admeasuring 98 Sq.Yds, or 81.93 Sq.Mtrs., situated at Abdullapur Village, Hayathnagar Mandal (old) Abdullapurmet Mandal (new) , R.R. District and bounded by: NORTH : Open land belongs to M. Balaiah; SOUTH : Owners Land (southern Part), EAST : 33" wide Road, WEST : Open land belongs to J. Lachaiah.

//BY ORDER OF THE COURT//
**D. JAGDEESH GOUD**
**M.S. THILAK**
**Advocates**
**Ph No. 7416500026**
Office: Plot No.1, Dawoodkhanguda, Badangpet, Balapur (M), R.R District



**PUBLIC NOTICE**

It is hereby informed that our clients **1. SMT. BHUVANESHWARI,** W/O. K. DAYANAND, AGED ABOUT: 45 YEARS, OCC: HOUSEHOLD, **2. SRI K. DAYANAND,** S/O. SRI K. DHARAMPAL, AGED ABOUT: 55 YEARS, OCC: BUSINESS, BOTH ARE R/O. PLOT NO. 298 & 299, FLAT NO.102, JHABHURAM APARTMENTS, GAUTHAM NAGAR, MALKAJGIRI, HYDERABAD, have entered into an Agreement of sale to purchase all that property All that the Residential House bearing No.20-71 (PTIN NO: 1170504008), on Plot No. 418, in Survey Nos.870, 871 and 872, admeasuring 206.00 Sq.Yards or 172.21 Sq.Mtrs., with a Plinth area of 672 Sq.Feet of RCC Roof, situated at GAUTHAM NAGAR COLONY, Malkajgiri, within the limits of Greater Hyderabad Municipal Corporation Malkajgiri Circle and Mandal, Medchal-Malkajgiri Districtand, bounded by : NORTH BY : HOUSE ON, PLOT NO.417, SOUTH BY : HOUSE ON PLOT NO.419, EAST BY : HOUSE ON PLOT NO.427, WEST BY : 20'-0" WIDE ROAD from SMT. BHYRAVABHOTLA VIJAYASREE, W/O. SRI RAVI TEJA BHYRAVABHOTLA, AGED ABOUT 53 YEARS, OCCUPATION: HOUSE WIFE, R/O. FLAT NO.A-18, SAI SWAGATH RESIDENCY, 5 TH FLOOR, CHITRAVATHI ROAD, PUTTAPARTHI, SRI SATHYA SAI DISTRICT, ANDHRA PRADESH-515134 and our clients have paid substantial amount.
If any Banks, Financial Institutions, persons, private sectors has got any objection against the said transaction they may put forth their objections before the undersigned along with the documentary proof within (03) days from the date of the publication. If objections are not received our clients will finalize the deal and the objections raised thereafter will not be entertained.

**L. SRINIVAS RAO**
**S. DINESH KUMAR**
**P. SRAVANTHI**
**ADVOCATES**
OFFICE: 6-5-519, New Bhoiguda, Secunderabad – 500 003
**Ph: 9848996020**

## తెలంగాణలో బిజెపి జెండాను ఎగురవేస్తాం

**: భాగ్యనగర్ జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు అనుముల భరత్ కుమార్**



బిజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండెను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు అనుముల భరత్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 4, ప్రభాతవార్త:**
తెలంగాణలో బిజెపి జెండా ఎగురవేస్తామని భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు అనుముల భరత్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండె ఆధ్వర్యంలో కార్యకర్తల నివాస సందర్శన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మూసారంబాగ్ లోని భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు అనుముల భరత్ కుమార్ నివాసానికి విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు గణేష్ కుండెని అనుముల భరత్ కుమార్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛలను అందజేసి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 150 మంది కార్యకర్తల నివాసాలను సందర్శించడంలో భాగంగా మొదటిసారి తన నివాసానికి రావడం జరిగిందని అనుముల భరత్ కుమార్ వివరించారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడమే లక్ష్యంగా తదుపరి కార్యాచరణ గురించి చర్చించడం జరిగిందని తెలిపారు. బీజేవైఎం కార్యకర్తలకు ధైర్యాన్నిస్తూ, ఎటువంటి సమస్యలు ఉన్న అండగా ఉంటామన్నారు. లాఠీలు, తూటాలకు భయపడేది లేదని, రానున్న రోజులలో తెలంగాణ గడ్డపై కాషాయపు జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఆలయ చైర్మన్‌కు ఆశీర్వచనం చేస్తున్న వేద పండితులు.

**వనస్థలిపురం. అక్టోబర్. 4. ప్రభాతవార్త.**
వనస్థలిపురం సచివాలయనగర్‌లో గల శ్రీ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు అమ్మ వార్లకు ,స్వామివారి కి క్షీరాభిషేకం, యాగశాల లో మహాపూర్ణాహుతి తిలకదారణ,చక్ర స్నానం, కుంభసంప్రోక్షన,సాయంత్రం ఆలయ కమిటీ ప్రతినిధులకు మహాదాశీర్వచనం,పండిత సన్మానం, ఆలయ చైర్మన్ కే. లక్ష్మయ్య ముగింపు సందేశం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.లక్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ కోశాధికారి శ్రీధర్,జాయింట్ సెక్రెటరీ రామలక్ష్మి భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి

**-రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ**



గ్రూప్ వన్ పోటీ పరీక్షల్లో విజయం సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను అభినందిస్తున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 4, ప్రభాతవార్త:**
ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గ్రూప్ వన్ పోటీ పరీక్షలలో విజయం సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్య విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రూప్ వన్ పోటీ పరీక్షల్లో ఆర్యవైశ్య విద్యార్థులు విజయం సాధించడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్య విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాకీ కార్డు ఉద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తాం : ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ



సబితా ఇంద్రారెడ్డిని సన్మానిస్తున్న అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:**
అసెంబ్లీ ఎన్నికల సమయంలో అమలుకు నోచుకోని హామీలను గుప్పించిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వాటిని విస్మరించింది ని మహేశ్వరం నియోజకవర్గం ముఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. దసరా పండగని పురస్కరించుకొని శుక్రవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డిని మీర్పేటలోని క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమాన్ని తీసుకువచ్చిందని,ప్రజల్లోకి ఆ ఉద్యమాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని సబితా ఇంద్రారెడ్డి సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆర్కెపురం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల శేఖర్, డివిజన్ మాజీ యూత్‌వింగ్ అధ్యక్షు డు శ్యాంగుప్తా, జగన్మోహ న్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, భూపాలరెడ్డి, రమేష్ కురుమ, కపిల్ పాల్గొన్నారు.



దసరా పండుగను పురస్కరించుకుని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యను తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ మేరు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆర్. కృష్ణయ్యను శాలువాతో ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

# నాగోల్ రహదారిలో పుట్‌పాత్‌లు ఆక్రమించి నిర్మాణాలు..!

**మెట్రో పార్కింగ్ పేరుతో దందా..**
**బడాబాబుల బాగోతం**

**ఉప్పల్, అక్టోబరు 4 ప్రభాతవార్త :** నాగోల్ నుంచి ఉప్పల్‌కు వచ్చే రహదారిలో పుట్‌పాత్‌లపై అనుమతి లేకుండా భారీ ఎత్తున దుకాణాలు నిర్మిస్తున్నారు. మెట్రో పార్కింగ్ లీజు పేరుతో కొందరు బడాబాబులు స్థలాలు తీసుకున్నామని చెబుతూ అనుమతి లేకుండా ఇన్నర్ రింగ్‌రోడ్ వెంట ఉన్న పుట్‌పాత్‌లను అక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. పది అడుగుల స్థలానికి రూ.రెండు లక్షల అడ్వాన్స్, ప్రతి నెలా రూ.20 నుంచి 50 వేల వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో డిప్యూటి కమిషనర్ స్పందించి పనులు నిలిపివేయగా కొందరు బడాబాబులను నుంచి వత్తిడి రావడంతో వెనక్కి తగ్గిన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నాగోల్ నుంచి ఉప్పల్‌కు వచ్చే రహదారిలో సర్వే అఫ్ ఇండియా ప్రహరిగోడ వెంట సుమారు పది అడుగుల మేరకు పుట్‌పాత్‌లు వదిలివేసి నిర్మాణాలు చేశారు. దీనిని మెట్రో పార్కింగ్ లీజు పేరుతో కొందరు తమకు ఇచ్చినట్లు చెబుతూ పత్రాలు సృష్టించారు. వీటిని చూపించి అక్కడే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారిని బెదిరించి అద్దెలు వసూలు చేస్తున్నారు. పుట్‌పాత్‌లపై వ్యాపారం చేయవద్దని ఉన్నతాధికారులు ఒక వైపు హెచ్చరికలు జారీ చేస్తున్నా కొందరు దీనిని ఖాతరు చేయడం లేదు. నాగోల్ ఇన్నర్ రింగ్ రోడ్డు వెంట కొత్తగా మరో ప్లైఓవర్ నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాధనలు సిద్దంగా ఉన్నాయి. దీనిని సైతం ఖాతరు చేయకుండా పక్కా నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. నిబంధనల ప్రకారం పుట్‌పాత్‌లపై చిన్న వ్యాపారాలు చేసుకుంటే అధికారులు అంతగా పట్టించుకోరు. కాని పూర్తి స్థాయిలో పక్కా నిర్మాణాలు చేస్తూ ఎటువంటి అనుమతులు తీసుకోకపోవడంపై పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు విమర్శలు వస్తున్నాయి.



నాగోల్ నుంచి ఉప్పల్ రహదారిలో పుట్‌పాత్‌లపై అనుమతి లేకుండా నిర్మిస్తున్న భారీ దుకాణాలు దృశ్యం.

**ఇన్నర్ రింగ్‌రోడ్ పుట్‌పాత్ అభివృద్ధి ఎలా..?**
ఇన్నర్ రింగ్‌రోడ్ అభివృద్ధిలో భాగంగా హబ్సిగూడ నుంచి ఎల్‌బినగర్ వరకు రోడ్డుకు ఇరు వైపులా పుట్‌పాత్‌లను అభివృద్ధి చేసేందుకు జిహెచ్‌ఎంసి ప్రణాళికలు సిద్ధం చేస్తింది. ఇందులో భాగంగా కొంతవరకు పనులు కూడా చేపట్టారు. ఇంకా పనులు చేయాల్సి ఉంది. అయితే దీనిని అసరాగా చేసుకుని పుట్‌పాత్‌లపై స్థలం ఉన్న ప్రాంతంలో షెడ్డులు నిర్మించి అద్దెకు ఇస్తున్నారు. దీనిపై స్థానిక అధికారులకు సైతం సరైన సమాచారం లేకపోవడంతో వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. మరో వైపు ఇన్నర్ రింగ్ రోడ్డు వెంట కొత్త ప్లైఓవర్ కూడా నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు ఇప్పటికే పలువురు భవన యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు.రోడ్డుకు ఇరు వైపులా నిర్మించే కొత్త ప్లైఓవర్ వల్ల సుమారు వంద వరకు నిర్మాణాలు పాక్షికంగా తొలగించే అవకాశం ఉందని టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వీరికి పరిహారం ఇచ్చే అవకాశం ఎలా ఉన్నా కొత్తగా నిర్మించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి వీటిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## భారతీయ కలలు ఎంతో విశిష్టమైనవి : ప్రిన్సిపాల్ హనుమాన్ కృష్ణ

**మలక్ పేట ,అక్టోబర్ 4, ప్రభాతవార్త:**
భారతీయ కలలు ఎంతో విశిష్టమైనవని శరత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమాన్ కృష్ణ పేర్కొన్నారు. శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు, ప్రముఖ సంగీత విద్వాంసులు పోపూరి శంకర శర్మ 105వ జయంతి కార్యక్రమాన్ని సరస్వతీ సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో బాగ్ అంబర్ పేట లోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా శంకర శర్మ జయంతిని పురస్కరించుకునిభక్తి సంగీత కచేరి నీ కనుల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శరత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమాన్ కృష్ణ, నటులు విశ్వమోహన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ కళలు చాలా గొప్ప వని, వాటిని సంరక్షించుకుని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రముఖ సంగీత విద్వాంసులు పోపురి శంకర శర్మ సదా చిరస్మరణీయులని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు పోపూరి శ్రీనివాస శర్మ తదితరులను అభినందించారు.



శంకర్ శర్మ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న ప్రిన్సిపాల్ హనుమాన్ కృష్ణ, విశ్వమోహన్, నిర్వాహకులు పోపూరి శ్రీనివాస్ శర్మ తదితరులు

అనంతరం ప్రముఖ సంగీత విద్వాంసులు పోపురి శ్రీనివాస్ శర్మ, వర్ధమాన గాయకులు తేజస్విని, యశస్విని, సంగీత విద్యాలయం విద్యార్థుల దివిజా, సాయి, సంధ్య, హితాన్ష్, మనోజ్ఞ, అభిజ్ఞ, అద్వి త్, అభయలు ఆలపించిన భక్తి గీతాలు అందరిని అలరించాయి. అచ్యుతకుమారి, హర ప్రజ్వల, దుర్గా కుమారులు వాయిద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## తాళం పగులగొట్టి ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో చోరీ

**-ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీ**
**-తప్పించుకున్న నిందితుడు**

**ఉప్పల్, అక్టోబరు 4 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవనం గది తాళం పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రెస్ క్లబ్ లో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు సిసి కెమెరాలు, డివిఆర్, మైక్ ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో శనివారం సాయంత్రం ప్రెస్ క్లబ్ భవనానికి తాళం వేసి వెళ్లిపోయారు. సుమారు రాత్రి పది గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రెస్ క్లబ్ భవనం గది తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. గదిలో ఉన్న టివి, ఆంప్లీఫైర్, హుండీలో ఉన్న కొంత నగదు తీసుకుని రోడ్డుపై వెళ్తుండగా శుక్రవారం రాత్రి 10 గంటలకు కొందరు వ్యక్తులు గమనించారు. అతనిని ప్రశ్నించగా పొంతన లేని సమాదానం చెప్పినట్లు తెలిపారు. దీంతో అతనిని తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వస్తుండగా తప్పించుకుని పరారీ అయినట్లు తెలిపారు. నిందితుడు తీసుకుని వెళుతున్న పరికరాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అంతకు ముందే గదిలో ఉన్న సిసి కెమెరాలు, డివిఆర్, మైక్ ఇతర వస్తువులు తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. నిందితుడి వీడియోలు సిసి కెమెరాలలో రికార్డు అయ్యాయి. ఉప్పల్ క్రైం ఎస్ఐ రజనీకర్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో చోరీకి గురైన డివిఆర్, ఇతర పరికరాలు దృశ్యం.

## గుర్రంగూడలో దుర్గామాత లడ్డూ, పట్టు చీర, కలశానికి వేలాలు

**-రూ.1,80,001 ధర పలికిన లడ్డూ**
**-రూ.1,01,001 ధర పలికిన పట్టు చీర**
**-రూ.43,001 ధర పలికిన పూజా కలశం**

**సరూర్‌నగర్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:**
బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ గ్రామంలో దుర్గామాత లడ్డూ వేలంలో అక్షరాలా ధర రూ.1,80,001 పలికింది. అదే విధంగా అమ్మవారికి అలంకరించిన పట్టు చీర రూ.1,01,001, పూజా కలశం రూ.43,001 ధర పలికింది. ప్రతి సంవత్సరం ఈ గ్రామంలో శ్రీదేవి శరన్నవ రాత్రి మహోత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులు భక్తులచే పూజలందుకున్న దుర్గామాతను నిమజ్జనానికి తరలించే ముందు అమ్మవారి చేతిలోని నైవేద్యం లడ్డూ, అలంకరణ చీర, పూజా కలశాన్ని గ్రామస్తుల సమక్షంలో ఉత్సవ కమిటీ వారు వేలం వేయడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో నవరాత్రి ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో అమ్మవారిని నిమజ్జనం చేయడానికి శోభాయాత్ర జరిపే ముందు నిర్వాహకులు వేలం ప్రక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూకు జరిగిన వేలంలో అందరి కంటే ఎక్కువ మొత్తంలో పాట పాడిన చిప్ప వెంకటేశ్ అనే భక్తుడు రూ.1,80,001 లకు దక్కించుకున్నాడు. అదే విధంగా దుర్గామాత పూజాలంకరణ పట్టు చీరకు జరిగిన వేలంలో స్థానిక బడంగ్‌పేట్ కార్పొరేషన్ 7వ డివిజన్ గుర్రంగూడ మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి అందరి కంటే అత్యధికంగా రూ.1,01,001 లకు పాట పాడి కైవసం చేసుకున్నారు. ఇక పోతే తొమ్మిది రోజుల పాటు ఉత్సవాల్లో పూజలో ఉంచిన కలశానికి జరిపిన వేలంలో రూ.43,001లకు జక్కిడి గోవర్ధన్‌రెడ్డి దక్కించుకున్నారు. వేలాల అనంతరం నిర్వాహకులు విజేతలను సన్మానించి వారికి లడ్డూ, పట్టు చీర, కలశాన్ని అందజేశారు. ఆ తర్వాత ఘనంగా పురవీధుల్లో దుర్గామాత శోభాయాత్రను నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో కొలను రాజవర్ధన్‌రెడ్డి, జక్కిడి గోవర్ధన్‌రెడ్డి, కొండా హేమంత్‌రెడ్డి, చిప్ప భాస్కర్, జక్కిడి సురేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, గొరిగె జంగయ్య, జక్కిడి వెంకట్‌రెడ్డి, పల్లె సాయికిరణ్‌గౌడ్, ఆర్ల శ్రీహరి, కందికంటి సాయికిరణ్‌గౌడ్, గుండ్ల గణేష్‌లతో పాటు గ్రామస్తులు,వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



దుర్గామాత లడ్డూ, పట్టు చీర, పూజా కలశంతో వేలం విజేతలను చిప్ప వెంకటేశం, గడ్డం లక్ష్మారెడ్డి, జక్కిడి గోవర్ధన్‌రెడ్డిలు

## దుర్గామాత విగ్రహాల నిమజ్జనంలో తప్పిన పెను ప్రమాదం

**హుడా కాంప్లెక్స్ అక్టోబర్ 4, ప్రభాతవార్త:**
సరూర్ నగర్ చెరువు కట్టపై దుర్గామాత విగ్రహాల నిమజ్జనంలో తప్పిన పెను ప్రమాదం. విగ్రహం నిమజ్జనం చేస్తుండగా ఒక్కసారిగా ఫల్టీ కొట్టి చెరువులో పడిన క్రేన్. చెరువులో పడటంతో తప్పిన పెను ప్రమాదం, ఒకవేళ రోడ్డు వైపు పడితే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉండేది. అనుభవం లేని సర్వీసెస్‌కు టెండర్ అప్పగించడంతోనే క్రేన్ పల్టీ కొట్టిందని, గత వినాయక నిమజ్జనంలో కూడా ఇదే కంపెనీకి చెందిన క్రేన్‌కు ప్రమాదం జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదం లో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. క్రేన్ డ్రైవర్ త్వరగ స్పందించి క్రేన్ లో నుండి కిందకు దూకేశాడు. విషయం తెలుసుకున్న లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి సంఘటన స్థలానికి వెళ్ళి వివరాలు తెలుసుకున్నారు.



పల్టీ కొట్టిన క్రేన్ సరూర్ నగర్ చెరువు వద్ద హుడా

## కెహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయండి



**తుర్కయంజాల్ అక్టోబర్4,ప్రభాతవార్త**
తుర్కయంజల్ మున్సిపాలిటీ చౌరస్తాలో , బాబా సాహెబ్ అంబేద్కర్ ,బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద కార్మిక హక్కుల పోరాట సంఘ నాయకులు కల్లెపు చంద్రశేఖర్ ప్రసాద్, తుమ్మల ప్రఫుల్ రామిరెడ్డి ( టి.యు.జె.ఏ.సి)అధ్యక్షులు, ( టి యు జె ఎ సి )వర్కింగ్ ప్రెసిడెంట్ తుల్జారెడ్డి ఆధ్వర్యంలో అక్టోబర్ 17 న సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగిగే ప్రథమ మహాసభ కరపత్రం విడుదల చేయడం జరిగినది . చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవలని, తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల బ్రతుకులు ఛిద్రమైపోయినా యని కార్మికులకు పని బద్రత లేదనీ అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, రాజు, ఆటో యూనియన్ నేతలు లక్ష్మయ్య, దేవయ్య, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన హరీష్ రావు, సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. అక్టోబర్. 4. ప్రభాతవార్త**
బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో నివాస ముంటున్న పోలె.చంద్రశేఖర్ రెండు సంవత్సరాల క్రితం చదువు నిమిత్తం అమెరికా లోని డల్లాస్ స్టేట్ కు వెళ్ళాడు. నిన్న రాత్రి గుర్తుతెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో చంద్రశేఖర్ మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న తెలంగాణా రాష్ట్ర మాజీ మంత్రి టి. హరీష్ రావు, ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి లు శనివారం భాధితుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీలైనంత త్వరగా చంద్రశేఖర్ .మృతదేహాన్ని ఇండియాకు రప్పిస్తామని తెలిపారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం

**ఉప్పల్, అక్టోబరు 4 ప్రభాతవార్త :** వారంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం ఉప్పల్ మినీ శిల్పారామం లో సారీస్ అఫ్ ఇండియా మేళ సందర్బంగా ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. శనివారం శివాని వాణి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. పుష్పాంజలి, బ్రహ్మాంజలి, జతిస్వరం, తాండవ నృత్యకారి, శ్రీ లలిత హారతి, శివాష్టకం, గరుడ గమన, శ్యామలే మీనాక్షి, శ్రీమాన్ నారాయణ, అంతయు నీవే, మూషిక వాహన, జగడపు, పలుకే బంగారమాయెనా అంశాలను శ్రీ వర్షిణి, శ్రీకరీ, సప్నా, రాధా, వైష్ణవి, రేవతి , పర్ణిక, ఉద్విత, కావ్య, వెన్నెల, వర్ష, ప్రణయ, శరణ్య, సేజల్ , దేవంశీ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు. నిర్మాణానికి ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ భాస్కర్, ఉమేష్ సింగ్, కిషోర్, మజీద్, అరుణ్, కాలనీవాసులు బాలయ్య రషీద్ రాములు తదితరులు పాల్గొన్నారు

## త్వరలోనే బండ్ అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం : కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



పల్టి కొట్టిన క్రేన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 4 ప్రభాతవార్త:** దుర్గామాత విగ్రహం నిమజ్జనం చేసే సమయంలో సరూర్ నగర్ చెరువు కట్ట వద్ద బండ్ కూలిపోవడంతో అక్కడ ఉన్న క్రేన్ పల్టి కొట్టిన విషయం తెలుసుకున్న లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకులు సరూర్ నగర్ చెరువు కట్ట గురించి పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం బండ్ అభివృద్ధి కోసం రూ.5.50 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి కోరారు.

**ఎలివేటెడ్ కారిడార్ పూర్తి చేయాలని సిపిఎం నిరహారదీక్ష**
**ఉప్పల్, అక్టోబరు 4 ప్రభాతవార్త :** ఉప్పల్ నుంచి నారపల్లి వరకు చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్లైఓవర్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ అక్టోబర్ 6న సోమవారం మేడ్చల్ జిల్లా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సిపిఎం పార్టీ కార్యదర్శి జె.వెంకన్న తెలిపారు. ఉప్పల్ రింగ్ రోడ్డులో జరిగే ఈ దీక్షలను సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఉప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలు, రాజకీయ పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.గత ఎనిమిది సంవత్సరాలుగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నట్లు చెబుతున్నారని,పనులు సాగడం లేదన్నారు.అస్థవ్యస్థంగా ఉన్నరోడ్డు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.దీనికి నిరసనగా ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు.

## తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కోల శ్రీనివాస్



కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలుపుతున్న కోల శ్రీనివాస్

**సరూర్‌నగర్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:**
తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్/ బడంగ్‌పేట్‌లకు చెందిన కోల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర కమిటీ కార్యవర్గంలో ఎంబిసి నాయకుడైన కోల శ్రీనివాస్‌కు ఉపాధ్యక్ష పదవిలో నియమించారు. ఈ సందర్భంగా ఆయన కవితను కలిసి పుష్పగుచ్ఛాన్నిచ్చి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కోల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో తనకు ఉపాధ్యక్ష పదవినిచ్చి గౌరవించినందుకు హర్షం వ్యక్తం చేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జాగృతి అభ్యున్నతికి, బలపేతానికి పాటుపడతానని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా జాగృతి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు.

## డిజిపి శివధర్‌రెడ్డికి చిగిరింత దంపతుల శుభాకాంక్షలు



కొత్త డిజిపి శివధర్‌రెడ్డిని సన్మానించిన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర డిజిపిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బత్తుల శివధర్‌రెడ్డిని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డిలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని లక్డీకాపూల్‌లో డిజిపి కార్యాలయానికి వచ్చిన వారు శివధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర డిజిపిగా శివధర్‌రెడ్డి నియమితులు కావడం పట్ల చిగిరింత దంపతులు హర్షం వ్యక్తం చేశారు.

## మాజీ మంత్రి పట్లోళ్ళ ఇంద్రారెడ్డి జయంతి



కౌకుంట్లలో ఇంద్రారెడ్డి జయంతి కార్యక్రమానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు అభిమానులతో సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోం మంత్రి, జై తెలంగాణ పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ పట్లోళ్ళ ఇంద్రారెడ్డి 71వ జయంతి శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించడానికి మహేశ్వరం నియోజకవర్గం, రాజేంద్రనగర్, చేవెళ్ళ నియోజకవర్గాల నుండే కాకుండా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంద్రారెడ్డి స్వగ్రామం కౌకుంట్లకు తరలివెళ్ళారు. అక్కడ ఇంద్రారెడ్డి సతీమణి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి, కుమారులు రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, యువ నాయకులు కౌశిక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డిలతో కలిసి ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు.

## తండ్రి మరణంతో కుంగుబాటు.. యువతి ఆత్మహత్య

**మేడిపల్లి, అక్టోబర్ 4 ప్రభాతవార్త :**
యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజంపేట వాణి (54) కూతురు (21) తో కలిసి చెంగిచెర్లలో నివాసం ఉంటున్నారు. భర్త మురళీ కృష్ణ ఐదు సంవత్సరాల క్రితం గుండె సంబంధిత సమస్యతో చనిపోయారు. అప్పటి నుంచి మాధురి డిప్రెషన్ లోకి వెళ్ళింది. మానసిక సమస్య కారణంగా బీటెక్ రెండవ సంవత్సరం మధ్యలో ఆపేసి ఇంటి వద్ద ఉంటుంది. మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో బంజారాహిల్స్ లో ఓ హాస్పిటల్లో వైద్యం చేయిస్తున్నారు. ఈనెల 2 తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని మాధురి చనిపోయిందని తల్లి మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ గోవిందరెడ్డి తెలిపారు.



ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ఉప్పరీ గూడ సంజయ్ గాంధీ నగర్ లో సుమారు 20 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ భాస్కర్, ఉమేష్ సింగ్, కిషోర్, మజీద్, అరుణ్, కాలనీవాసులు బాలయ్య రషీద్ రాములు తదితరులు పాల్గొన్నారు